J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

లాయర్

సంపుటి : 41 సంచిక : 31 07.1.2022, శుక్రవారం వెల : రూ. 5 /-

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి

సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# అక్కడా.. ఇక్కడా..? సందిగ్ధంలో షర్మిల!



## ఆమె లక్ష్యం ముఖ్యమంత్రి కావడమా? లేక అన్నను అభాసుపాలు చేయడమా??

*దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంలో మొదలైన అంతర్గత కలహాలు క్రమేణా బహిర్గతమవుతున్నాయి. ఇడుపులపాయలో క్రిస్మస్ పండుగ వేదికగా రాజశేఖరరెడ్డి స్మారకం సాక్షిగా జరిగిన సంఘటనలు ఈ విషయాలను స్పష్టం చేస్తున్నాయి. తండ్రి సమాధి వద్ద క్రిస్మస్ ప్రార్థన చేయకుండా ఇడుపులపాయ వ్యవసాయక్షేత్రం నుండి ముందురోజు రాత్రే షర్మిల హైదరాబాదుకు వెళ్లిపోయారు. ప్రతిసారీ కొడుకుతో పాటు కలసివెళ్ళే ముఖ్యమంత్రి తల్లి, వైయస్సార్ పార్టీ గౌరవాధ్యక్షురాలు వైయస్ విజయమ్మ ఈసారి ఒంటరిగానే భర్త సమాధివద్దకు వెళ్ళి ప్రార్థన చేశారు. ఇవన్నీ అప్పట్లో పత్రికల్లో ఛానళ్ళలో వచ్చిన అంశాలే. అయితే తాజాగా 'ఆంధ్రలో కూడా పార్టీ పెడతారా ...?' అని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు, 'పార్టీ అన్నాక ఎక్కడైనా పెట్టుకోవచ్చు' అని షర్మిల ఇచ్చిన సమాధానం, ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీస్తోంది.*

షర్మిల తెలంగాణలో పార్టీ ప్రకటించినప్పుడు... అధికారంలోకి రావాలనే దృఢమైన సంకల్పం, బలమైన లక్ష్యం ఆమెలో స్పష్టంగా కనిపించాయి. మీడియా సమావేశంలో 'కేటీఆర్ అంటే ఎవరు' అని వ్యంగ్యధోరణితో ప్రశ్నించడమే కాకుండా, ఆ సమావేశంలో విలేకరులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానాలతో ఆమెలో మంచి సమయస్ఫూర్తి ఉందని అనిపించింది. పార్టీ పేరు నిర్ణయించడంలోనూ, తాను తెలంగాణలోనే పుట్టి పెరగడమే కాకుండా, తన మెట్టినిల్లు కూడా తెలంగాణ గడ్డే అంటూ పదే పదే చెప్తూ తెలంగాణ ప్రజల దృష్టిలో తాను వాళ్ళ బిడ్డనే అనే భావన కల్పించడానికి ఆమె చేస్తున్న ప్రయత్నంలోనూ పరిపక్వత కనిపించింది. రాజకీయంగా చేపడుతున్న దీక్షలు, పాదయాత్రలతో పాటు ప్రజా క్షేత్రంలో ఆమె చేస్తున్న పోరాటాలలో రాజకీయ పటిమ స్ఫురించింది. తాను వై.ఎస్ షర్మిల కాదు టీ.ఎస్ షర్మిల అన్న గుర్తింపు తెచ్చుకోవడానికి ఆమె చేసిన శ్రమతో మంచి గుర్తింపుని సాధించింది. ఇలాంటి

10లో

# కలసివుంటే కలదుసుఖం



జనవరి 4వ తేదీ గౌతంరెడ్డి నెల్లూరు నగరంలోని ఆనం రామనారాయణరెడ్డి ఇంటికి వెళ్ళారు. తమ ఇంటికి వచ్చిన అమాత్యుడిని ఆనం సగౌరవంగా పూలబొకేతో ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఇద్దరూ పరస్పరం జిల్లా రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకున్నారు. చివరిగా నూతన సంవత్సర కేకును కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఆనం వివేకా కుమారుడు రంగమయూర్‌రెడ్డి కూడా వారి పక్కనే ఉన్నారు.

## ప్రత్యేకతను సంతరించుకున్న భేటీ ...!

రెడ్ల ప్రాబల్యం బలంగా ఉన్న జిల్లా నెల్లూరు. 2014లో రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చినా వైసీపీకి అత్యధిక సీట్లు కట్టబెట్టిన జిల్లా నెల్లూరు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రెడ్లకు సరైన గుర్తింపు లేదన్న అసంతృప్తి చాలా మందిలో ఉంది. దీనికితోడుగా జిల్లాలో రెడ్ల ఆచూకీయే లేకుండా చేస్తానని ఒక కీలక నాయకుడు పదే పదే మాట్లాడుతుండడం కూడా చాలా రోజులుగా చర్చనీయాంశమవుతోంది. ఆ ఘనుడు నాలుగుగోడల మధ్య మాట్లాడినా, అది ఆ నోటా ఈ నోటా పాకి తాడేపల్లికి చేరిందని సమాచారం. ముఖ్యమంత్రి జగన్ కూడా ఈ విషయంలో తీవ్రంగా స్పందించినట్లు వార్త. మరో 30నెలల్లో మళ్ళీ ఎన్నికలు రానున్నాయి. ఒకవేళ ముందస్తు ఎన్నికలకు వెళ్తే రెండేళ్ళే వ్యవధి

10లో

## ఆనంతో మేకపాటి భేటి..!

*జిల్లా రాజకీయాలలో 2022లో కొత్త పొత్తు పొడిచింది. పార్టీ అధికారంలోకి వచ్చిన 30నెలలుగా ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా ఉన్న జిల్లా నాయకులలో మార్పు కనిపించింది. ముఖ్యంగా మంత్రి మేకపాటి గౌతంరెడ్డి జిల్లాలోని సీనియర్ రాజకీయనేత, మాజీ మంత్రి, తమ పార్టీ వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి ఇంటికి వెళ్లడం జిల్లా రాజకీయాలలో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఈ పరిణామంతో జిల్లా రాజకీయాలలో కొంత మార్పు వస్తుందనడంలో సందేహం లేదు.*



అంగరంగ వైభవంగా..

# అల్లూరు పోలేరమ్మ జాతర





జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అల్లూరు గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారి జాతర ఈనెల 4న అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిమంది భక్తులు ఈ జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. రత్నాలంకారంతో, బంగారుచీరతో అమ్మవారిని అలంకరించి శాస్త్రోక్తంగా విశిష్ట పూజలు నిర్వహించారు. ఆలయమంతా పుష్పాలంకారాలతో సర్వాంగసుందరం గావించారు. విద్యుద్దీపకాంతులతో దేదీప్యమానం చేశారు. గ్రామాన్ని చల్లగా కాపాడే గ్రామ దేవతలు, అక్కాచెల్లెళ్ళయిన శక్తిదేవతలు గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు అల్లూరు ప్రజలు ఈ జాతర సందర్భంగా ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముగ్గురమ్మల ఆలయాలను అందంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా కొత్తకుండలతో నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అల్లూరు గ్రామంలో అమ్మవారి ఊరేగింపులో గ్రామప్రజలు అడుగడుగునా హారతులు పట్టారు. 'అమ్మా తల్లీ పోలేరమ్మా!.. కరుణించమ్మా..కాపాడమ్మా' అంటూ భక్తులు పెద్దపెట్టున అమ్మవారిని ప్రార్థించారు. తప్పెట్లు, తాళాలు, నృత్యాలు, అమ్మవారి పాటలతో జాతర హోరెత్తిపోయింది. అల్లూరు ఊరు ఊరంతా భక్తజనసంద్రంగా మారిపోయింది. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పోలేరమ్మ అమ్మవారి కమిటీ సభ్యులంతా కలిసికట్టుగా భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అమ్మవారి జాతరను పర్యవేక్షించారు.

# చిన్ననాటి జ్ఞాపకాలు.. ఆటపాటలతో సంబరాలు

## విడవలూరులో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వారంతా 1989–90 బ్యాచ్‌లో విడవలూరు జడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న విద్యార్థులు. సుమారు మూడు దశాబ్దాల తర్వాత మళ్ళీ ఒక్కసారిగా అందరూ కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల సమీపంలోనే ఉన్న సాయిబాబా మందిరంలో ఈనెల 2న ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని తాము చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పట్లో మిత్రులుగా ఉన్నవారంతా ఒకరికొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని నాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. చిన్నపిల్లల్లా ఆటపాటలతో గంతులు వేస్తూ సంబరంగా గడిపారు. అప్పటి నుంచి జీవితంలో తమ ఎదుగుదలను, ఇప్పుడు చేస్తున్న ఉద్యోగాలను ఒకరికొకరు తెలుసుకుని సంతోషించారు. తమకు పాఠాలు చెప్పి జీవితపాఠాలు నేర్పించిన గురువులకు అందరూ కలిసి కృతజ్ఞతలు చెప్పుకుని వారిని గౌరవంగా సత్కరించారు. ఈ పాఠశాలలో అప్పట్లో చదువుకున్న విద్యార్థి ఎంటెక్‌లో కాంక్రీట్ కట్టడాలపై పరిశోధనలు చేసినందుకు డాక్టర్ ఎ.శ్రీనివాసులును ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులంతా కలిసి ఘనంగా సన్మానించారు.

# కొత్త సంవత్సరం.. ప్రారంభంలోనే ప్రమాదాలు

- ఆరుగురి కుటుంబాల్లో విషాదం
- సిద్ధనకొండూరు వీఆర్ఓ దుర్మరణం



సుధాకర్ (ఫైల్‌ఫోటో)



మృతిచెందిన వీఆర్ఓ సుధాకర్

కొత్త సంవత్సరం ప్రారంభంలోనే జిల్లాలోని పలు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందడంతో మృతుల కుటుంబాల్లో విషాదం మిగిలింది. అధికారులకు కొత్తసంవత్సరం శుభాకాంక్షలు చెప్పి తమ స్వస్థలమైన వింజమూరు బీసీకాలనీకి తిరిగి వస్తూ కలిగిరి మండలంలోని సిద్ధనకొండూరు గ్రామ రెవెన్యూ అధికారి నీలం వెంకటసుధాకర్(28) కలిగిరి పంచాయతీలోని జిర్రావారిపాళెం తిప్ప దగ్గర జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో ఆయన కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. ఆయన నడుపుతున్న మోటార్‌బైక్ అదుపు తప్పి ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి, వెంటనే ఎదురుగా వస్తున్న ఆర్టీసి బస్సును ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే కావలి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళగా అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు తెలిపారు. అవివాహితుడైన సుధాకర్ కుటుంబసభ్యుల రోదన అంతా ఇంతా కాదు. అదేవిధంగా అదేరోజున మద్దాలి వెంకటేష్(27) పెళ్ళకూరు నుంచి చిత్తూరు జిల్లా బుచ్చినాయుడుకండ్రిగలోని కాంపాళెం గ్రామంలో ఉన్న భార్య వద్దకు మోటార్‌బైక్‌పై వెళ్తుండగా నాయుడుపేట–పూతలపట్టు జాతీయరహదారిపై బైక్ అదుపుతప్పి తలకు దెబ్బతగిలి అక్కడికక్కడే మరణించాడు. 8 నెలల కిందట వెంకటేష్‌కు వివాహమైంది. ఆయన మరణంతో భార్య, తల్లిదండ్రుల రోదనకు అంతేలేదు.

### రోడ్డుప్రమాదంలో వృద్ధుని కన్నుమూత :

తడ వద్ద జాతీయ రహదారిపై ఈనెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని తమిళనాడుకు చెందిన కాశి అనే వృద్ధుడు మృతిచెందాడు. గుమ్మిడిపూండికి చెందిన కాశి మోపెడ్‌పై ఆరంబాక్కంలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా దారిలో ఈ ప్రమాదం జరిగింది. లారీ వేగంగా వచ్చి మోపెడ్‌ను ఢీకొనడంతో కాశి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మరణించాడు. మరో ప్రమాద సంఘటన నెల్లూరు వద్ద వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్‌పై జరిగింది. మోటార్‌బైక్‌ను మరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన షేక్ మీరావలి మృతిచెందాడు. కోవూరు వద్దనున్న ఇనమడుగులో ఉన్న బంధువులింటికివచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇంకొక దుర్ఘటనలో ఇందుకూరుపేట మండలం నరసాపురంలో అర్ధరాత్రి సమయంలో జరిగిన ప్రమాదంలో బైక్ అదుపుతప్పి కాలువలో పడిపోయి ఓ యువకుడు కన్నుమూశాడు. కొమరిక గ్రామానికి చెందిన కోట పవన్‌కుమార్ (23) మైపాడు నుంచి ఇంటికి తిరిగివస్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన మృతితో కుటుంబసభ్యుల, బంధుమిత్రుల రోదన వర్ణనాతీతం. కావలి రూరల్ మండలంలోని అడవిరాజుపాళెం గ్రామానికి చెందిన జగదీష్ జనవరి 1న గౌరవరం జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం మీద వస్తుండగా, అదుపుతప్పి లారీ కింద పడడంతో జగదీష్ కాళ్ళు నుజ్జునుజ్జు అయిపోయాయి. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే మరణించాడు. దీంతో ఆయన కుటుంబసభ్యులు గోడుగోడుమంటున్నారు.

కొత్త సంవత్సరారంభం రోజునే ఈ ప్రమాదాలు జరిగి ఆరుగురు దుర్మరణం పాలుకావడం జిల్లా ప్రజలను తీరని ఆవేదనకు గురిచేసింది.

# టిటిడి ఆధ్వర్యంలో 3డి క్యాలెండర్



శ్రీవారు, అమ్మవార్ల చిత్రాలకు 3డి ఎఫెక్ట్, సిల్వర్ కోటింగ్‌తో తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన 6 పేజీల ప్రత్యేక క్యాలెండర్‌ను ఇటీవల టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఇఒ డా. కెఎస్.జవహర్‌రెడ్డిలు ఆవిష్కరించారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు ఇఒ ఏవి ధర్మారెడ్డి, టిటిడి మెడికల్ అడ్వైజర్ డా. శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# త్యాగరాజస్వామి ఆరాధకుల భిక్షాటన

- సంకీర్తన గానాలతో.. పులకిస్తున్న పురవీధులు
- మార్చి 22 నుంచి స్మరణోత్సవాలు



నెల్లూరు నగరంలో శ్రీ త్యాగరాజస్వామి ఆరాధకుల భిక్షాటన ప్రారంభమైంది. త్యాగయ్య సంకీర్తనలను గానం చేస్తూ భక్తులు పురవీధుల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తున్నారు. ఇలా భిక్షాటన చేయగా వచ్చిన ద్రవ్యంతో, దాతల సహకారంతో ఏటా నెల్లూరు టౌన్‌హాలులో గత 56 సంవత్సరాలుగా భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. త్యాగరాజ భిక్షువు, ప్రముఖ హరికథాగాన కళాకోవిదుడు, నెల్లూరును మరో తిరువయ్యార్‌గా తలపింపజేసిన స్వర్గీయ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, ఆయన స్నేహితుడు స్వర్గీయ ఎనమండ్ర వెంకటేశ్వరశాస్త్రి అప్పట్లో ప్రారంభించిన ఈ భక్తి సంగీత కళారాధన వారి సంకల్పబలంతో ఇంతకాలంగా నిర్విఘ్నంగా సాగిపోతూనే ఉంది. కాలక్రమంలో వారిరువురూ కాలధర్మం చెందిన తర్వాత వారిరువురి తనయులు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం), ఎనమండ్ర నాగదేవిప్రసాద్‌లు ఈ స్మరణోత్సవాలను అకుంఠితంగా నిర్వహిస్తూ వస్తున్న నేపథ్యంలో, ఇటీవల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కూడా కాలంచేయడంతో, ఆయన తనయుడు ఎస్పీ చరణ్ ఈ స్మరణోత్సవ సభ కమిటీకి అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం నాగదేవిప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు భక్తులు, సంగీతా రాధకులు బృందంగా ఏర్పడి భిక్షాటనచేస్తూ శ్రీ త్యాగరాజ స్వామివారి స్మరణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ప్రఖ్యాత శాస్త్రీయ సంగీతవేత్తలను నెల్లూరుకు ఆహ్వానించి వారిచే సంగీతసభలు నిర్వహిస్తుండడం ఆనవాయితీ. వారం రోజుల పాటు సంగీతపండుగగా నిర్వహించే ఈ ఉత్సవాలకు నెల్లూరీయులతో పాటు చుట్టుపక్కల అనేక ప్రాంతాల నుంచి సంగీతాభిమానులు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. ఈ ఏడాది మార్చి 22 నుంచి 28వ తేది వరకు జరగనున్న 57వ భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాల నిర్వహణకు త్యాగరాజ ఆరాధకుల బృందం గత డిసెంబరు నెలాఖరు నుంచి భిక్షాటన చేస్తున్నారు. సుమారు 25 మంది సంగీత కళాకారుల బృందం శ్రీ త్యాగరాజ స్వామి సంకీర్తనలు ఆలపిస్తూ నెల్లూరు పురవీధులను పులకింపజేస్తున్నారు. నగరంలోని ప్రతి ఇంటా వారికి ఆదరణ లభిస్తోండడం విశేషం. అదేవిధంగా, శ్రీ త్యాగరాజస్వామి తిథిని పురస్కరించుకుని ఈనెల 22న వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో ఆరాధనా మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు మందిరం నిర్వాహకుడు నాగదేవిప్రసాద్ ఏర్పాట్లు చేస్తున్నారు.

# మళ్ళీ విజృంభిస్తున్న.. గొలుసు దొంగలు



మహిళల మెడల్లో బంగారుదండలను తెంపుకుపోయే దుండగులు మళ్ళీ విజృంభిస్తున్నారు. గత కొద్దికాలంగా వారి బెడద తప్పిపోయిందిలే అనుకుంటుంటే అదను చూసి తమ చేతివాటం చూపుతున్నారు. ఈనెల 3వతేదీ రాత్రి నెల్లూరు నవాబుపేటకు చెందిన సరిత, ఆమె కుమార్తె ఇద్దరూ కలిసి లక్ష్మీనగర్‌కు స్కూటీపై వెళ్ళారు. అక్కడ స్కూటీని పార్క్ చేస్తున్న సమయంలో ఓ దుండగుడు సర్రుమంటూ బైక్‌మీద వచ్చి సరిత మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారు గొలుసును తెంపుకుపోయాడు. ఆమె తేరుకుని అరిచేలోపే పరారయ్యాడు. బాధితురాలు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐ నరేష్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు గట్టి నిఘా పెట్టి ఈ గొలుసు దొంగల పనిపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

### డా. విష్ణుస్వరూప్‌రెడ్డికి
# అభినందన అవార్డు



చెవి, ముక్కు, గొంతు నిపుణుడిగా ప్రపంచంలో ఉన్న ప్రతిభావంతులలో ఒకరిగా గుర్తింపు సాధించిన మన నెల్లూరీయుడు, మైపాడు వాస్తవ్యుడు, డాక్టర్ నారపరెడ్డి విష్ణుస్వరూప్‌రెడ్డిని 'టైమ్స్' మీడియా సంస్థ 'ఐకానిక్ అవార్డు'తో సత్కరించింది. చెవిటి వారికి వినిపించి వారిచేత మాటలు పలికించడానికి దోహదపడే 'కాక్లియర్' పరికరాన్ని శస్త్ర చికిత్స ద్వారా అమర్చడంలో తన ప్రతిభను చాటుతున్న విష్ణుస్వరూప్‌రెడ్డిని ఆయన సమర్థతకు గుర్తుగా టైమ్స్ సంస్థ ఈ 'ఐకానిక్' అవార్డుతో గౌరవించింది. ఇటీవల హైదరాబాదులో జరిగిన ఒక వేడుకలో తెలంగాణ మంత్రి హరీష్‌రావు చేతులమీదుగా డాక్టర్ విష్ణు ఈ అవార్డును అందుకున్నారు.





# త్వరలో కోవూరు బడికి మోక్షం


శిథిలమైన పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

ఎంతోకాలంగా శిథిలావస్థలో ఉన్న కోవూరు జెబిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎట్టకేలకు మంచి రోజులొచ్చాయి. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ ఈనెల 6వ తేది గురువారం ఆ బడిని సందర్శించి ఆ బడి బాగుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. శిథిలభవనం స్థానంలో త్వరలోనే కొత్త భవనాన్ని నిర్మించేందుకు కృషిచేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న విలేకర్లకు తెలిపారు. వారివెంట నాయకులు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, వీరి చలపతిరావు, జొన్నవాడ దేవస్థానం మాజీ ఛైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరోనా కలవరపెడుతూనే ఉంది

## ○ మళ్లీ పెరుగుతున్న కోవిడ్ కేసులు..



జిల్లాను కరోనా మహమ్మారి వ్యాధి కలవరపెడుతూనే ఉంది. ఈ వ్యాధి నేటికీ తగ్గకపోగా ఇంకా విజృంభిస్తూనే ఉంది. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు జిల్లా వైద్యాధికారులు నిత్యం జిల్లాలో అనేకమందికి వైద్యపరీక్షలు చేస్తూనే ఉన్నారు. కరోనా పాజిటివ్ ఉన్నవారిని గుర్తించి వారికి ఎప్పటికప్పుడు చికిత్సలు అందజేస్తూనే ఉన్నారు. కరోనా వ్యాధి వచ్చి పడినప్పటినుంచి ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతూనే ఉంది.

### కొత్తగా 30 కేసులు...

ఇటీవల కొద్దిగా తగ్గినట్లు కనిపించినప్పటికీ మళ్లీ అక్కడక్కడా కేసులు వస్తూనే ఉన్నాయి. ఈనెల 5న మరో 30 కోవిడ్ కేసులు నమోదయ్యాయి కూడా. దీంతో ఇప్పటి దాకా జిల్లావ్యాప్తంగా 1,47,193 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా వీరిలో 1,46,003 మంది వైద్యుల చికిత్సలతో కోలుకున్నారు. ఈ వ్యాధితో ఇప్పటికే జిల్లాలో 1049 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా ప్రస్తుతం 130 యాక్టివ్‌కేసులు ఉన్నాయి. 14 మంది ఇన్‌పేషెంట్లుగా చికిత్సలు పొందుతున్నారు. మరోవైపు కోవిడ్ నివారణకు టీకా వేసే కార్యక్రమం కూడా జిల్లాలో సజావుగా జరుగుతూనే ఉంది. జిల్లాలో 15 నుంచి 18 ఏళ్ళలోపు వారికి ఈనెల 5న వైద్యశాఖ ఆధ్వర్యంలో 25,587 మందికి కోవాగ్జిన్ టీకా వేశారు కూడా. ఏదేమైనా కరోనా థర్డ్‌వేవ్‌తో పాటు మరోవైపు ఒమిక్రాన్ వేరియంట్ సర్వత్రా విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో ప్రతిఒక్కరూ ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందుజాగ్రత్తలు మరచిపోవద్దని, కోవిడ్ నిబంధనలు పాటిస్తూ కరోనాకు దూరంగా ఉండాలని అధికారులు పదేపదే హెచ్చరిస్తున్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు
# 'విప్రో' చేయూత

'విప్రో' వారి ఆర్థిక సాయంతో నెల్లూరులోని నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వరదబాధితులకు, మరో 250 మంది పారిశుద్ధ్య కార్మికులకు నెలరోజులకు సరిపడా 18 రకాల నిత్యావసర సరుకులు అందించారు. ఈనెల 5న నెల్లూరు దర్గామిట్టలోని కస్తూర్బా కళాక్షేత్రం ఆవరణంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. జయలలితనగర్ నివాసులకు, పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేశారు. జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ విప్రో సంస్థ సేవలను, నిర్వాహకులు నవజీవన్ సంస్థ వారిని అభినందించారు. డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, నెహ్రూ యువ కేంద్రం యూత్ కో–ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, నవజీవన్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కె. సహదేవయ్య, ప్రాజెక్ట డైరెక్టర్ విక్టోరియా, ఎన్జీవో కోఆర్డినేటర్ సునీల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ షేక్ రసూల్, జి.వి.రమణారెడ్డి, కె.గోపాల్, బిందుమాధవి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, రమేష్, మోహన్, ప్రతాప్, రమణయ్య, రాజేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సోమిరెడ్డి సింధు సింగరయ్యింది...!

రాష్ట్ర తెలుగుదేశం నాయకులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమార్తె శ్రీమతి సోమిరెడ్డి సింధు సింగరయ్యింది. 1976లో విడుదలై సంచలనం సృష్టించిన 'కభీ కభీ' సినిమాలో ముకేశ్‌కుమార్, లతామంగేష్కర్ కలసి పాడిన టైటిల్ సాంగ్‌ని సోమిరెడ్డి సింధు సోలోగా పాడింది. ప్రస్తుతం యూట్యూబ్‌లో ఈ పాట సంగీతప్రియులకు, నెటిజన్లకు వీనులవిందు చేస్తోంది. ఆల్ ది బెస్ట్ టు సింధు.




https://www.youtube.com/watch?v=gmg5XLWKZSo

# పండుగలా పట్టాల పంపిణీ



జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద జిల్లాలోని సైదాపురం, కలువాయి, రాపూరు మండలాల పరిధిలోని లబ్ధిదారులకు ఈనెల 6వ తేది గురువారం నాడు మాజీ మంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ మద్దెల గురుమూర్తి చేతుల మీదుగా సంపూర్ణ హక్కు పత్రాల దస్తావేజులను పంపిణీ చేశారు.



## 'ప్రభా'తం

దేశంలో మహిళలపై దాడులకు పాల్పడేవారికి ఎంతటి కఠినశిక్షలున్నా మహిళలపై అఘాయిత్యాలు రానురాను అంతకంతకూ పెరుగుతున్నాయే తప్ప ఏమాత్రం తగ్గడం లేదు. అన్ని రంగాల్లో మహిళలు మునుపటి కన్నా మరింత ప్రతిభాపాటవాలతో ముందుకు దూసుకుపోతున్నా మహిళలపై నేరాలు ఘోరాలు సమసిపోవడమే లేదు. ఎక్కడ చూసినా మహిళలు, స్త్రీలు, బాలికల పట్ల అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోతూనే ఉన్నాయి. మహిళలకు సాధికారత రావాలని, మహిళలు కన్నీరు పెట్టుకోకూడదని, వారు బాగుంటేనే కుటుంబాలు బాగుంటాయని అందరూ అంటుంటారే తప్ప ఆచరణలో మహిళల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుంటోంది. సమాజంలో మహిళల పట్ల దాడులు తగ్గడం లేదు. ఇదెంతో దురదృష్టకరం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లుపూళ్ళు గడిచిపోతున్నా, ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం ఆకాశానికి అంటుతున్నా, విద్య విజ్ఞానరంగాల్లోనూ, సాహసోపేతమైన అనేక రంగాల్లోనూ మహిళలు పురుషులతో ధీటుగా రాణిస్తున్నా దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళల దుస్థితి అత్యంత దయనీయంగానే ఉంటోంది. ఎక్కడ చూసినా వివక్ష, కుటుంబాల్లో కలహాలు, గృహహింస పెరిగిపోతూనే ఉన్నాయి. ఇళ్ళల్లోనూ, కార్యాలయాల్లోనూ, వీధుల్లోనూ ఇలా ఎక్కడ చూసినా మహిళలకు హింసే ఎదురవుతోంది. భర్తను, బిడ్డలను, కుటుంబాన్ని ప్రాణం కన్నా మిన్నగా భావించే తల్లులను, మహిళామూర్తులను నిరంతరం వేదిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. స్త్రీని అక్కలా, చెల్లెలా, అమ్మలా భావించాల్సిన మన భారతీయ సమాజంలోనూ, 'భరతమాత' అంటూ దేశాన్నే తల్లిగా భావించి గౌరవించుకునే మన దేశంలోనూ భరతమాత ముద్దుబిడ్డలైన స్త్రీమూర్తులు కొందరి దౌష్ట్యాల ధాటికి కంటికి కడివెడు కన్నీళ్ళతో, నిరంతరం వేదనలతోనే మనుగడ సాగిస్తుండడం విచారకరం. నవమాసాలు మోసి రక్తాన్ని పంచి చావుబతుకులను కూడా లెక్కచేయకుండా బిడ్డలను కని, ప్రాణసమానంగా పెంచి పెద్దచేసే తల్లుల పట్ల కూడా సమాజంలోని అనేక కుటుంబాల్లో దారుణమైన వివక్ష, నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉండడం బాధాకరం. ఒకవైపు పేదరికం, మరోవైపు అజ్ఞానం, సమాజం పట్ల సరైన అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, అన్నిటికీ మించి అమాయకత్వం మూర్తీభవించిన అబలలు దేశంలో కోకొల్లలుగానే ఉన్నారు. ఇదే అదనుగా రాక్షస స్వభావం, నేరప్రవృత్తి కల పురుషమృగాలు వారిపై ఘోరమైన అఘాయిత్యాలకు, లైంగిక దాడులకు, హత్యాచారాలకు పాల్పడుతూనే ఉన్నారు. నిత్యం ఏ పత్రిక చూసినా, ఏ ప్రసార మాధ్యమాన్ని తిలకించినా ఎక్కడో ఒకచోట మహిళలపై జరుగుతున్న రకరకాల అకృత్యాల కథనాలు కనపడుతూనే ఉన్నాయి.. వినపడుతూనే ఉన్నాయి. సభ్యసమాజానికి ఆందోళనను, ఆవేదనను కలిగిస్తూనే ఉన్నాయి. ఈ నేరాలు, ఘోరాలను అదుపులో పెట్టేందుకు దేశవ్యాప్తంగా ఎన్నో కఠినమైన చట్టాలున్నప్పటికీ నేరగాళ్ళు మాత్రం భయమన్నదే లేకుండా మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతూనే ఉన్నారు. ప్రతి పురుషుడూ ఒక మాతృమూర్తి కన్నబిడ్డే అయినా, పెద్దయ్యాక విచ్చలవిడితనంతో పశుప్రవృత్తితో ప్రవర్తిస్తూ కనీసం దయ, జాలి, మానవత్వమన్నది కూడా లేకుండా మహిళలపై దాడులకు పాల్పడుతూనే ఉండడం ప్రజల హృదయాలను కలచివేస్తూనే ఉంది. మహిళలపై నేరాలు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయని, తగ్గడమంటూ ఉండడం లేదని అనేక సర్వేలు చెపుతూనే ఉన్నాయి. తాజాగా ఇటీవలే మహిళలపై నేరాలకు సంబంధించి జాతీయ మహిళా కమిషన్‌కు 31వేల దాకా ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తేటతెల్లమవు తుంది. 2020లో 23,722 ఫిర్యాదులు రాగా, 2021లో 30 శాతం ఫిర్యాదులు పెరిగాయి. అందులోనూ గత ఏడాది జులై నుంచి సెప్టెంబర్ దాకా ప్రతి నెలా సగటున 3100 ఫిర్యాదుల దాకా అందాయని మహిళా కమిషన్ తాజా నివేదిక వెల్లడిస్తోంది. ఇందులో మొత్తంగా 11013 కేసులు మహిళలకు మానసిక వేధింపులు, 6,633 గృహహింస కేసులు, 4589 వరకట్నం కేసులు, మరో 1675 అత్యాచార యత్నాలు, అఘాయిత్యాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ఇలాంటి నేరాల్లో ప్రథమస్థానంలో ఉంది. అదేవిధంగా ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్ రాష్ట్రాల్లో మహిళలపై నేరాలు ఘోరాలు మరింతగా పెరిగిపోతూనే ఉన్నాయి. దేశంలోని మిగతా రాష్ట్రాల్లోనూ పరిస్థితి ఏమంత ఆశాజనకంగా లేదు. ఎక్కడ చూసినా ఇదే తంతు. మహిళల పట్ల గౌరవభావం పెరిగేలా చిన్నతనం నుంచి పాఠశాలల్లో బోధన జరగాలి. సాటి విద్యార్థినుల పట్ల, మహిళల పట్ల ఎలా సోదరభావంతో మెలగాలో పదేపదే చెప్పుండాలి. స్త్రీలంటే మాతృదేవతలుగా పూజ్యభావంతో ఉండాలనే సంస్కారాన్ని నేర్పాలి. నేరాలకు పాల్పడితే ఎలాంటి కఠినచర్యలుంటాయో వారికి అవగాహన కలిగించాలి. అన్ని వర్గాల ప్రముఖులు, స్వచ్ఛందసేవకులు, మేధావులు ప్రత్యేకించి ఈ విషయాల పట్ల శ్రద్ధ తీసుకుంటూ నిరంతరం పాఠశాలల్లో, కళాశాలల్లో, గ్రామాలు పట్టణాల్లో అన్నిచోట్ల సమాజసంస్కరణ కోసం నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండాలి. మహిళల పట్ల దాడులకు పాల్పడేవారిపై ప్రభుత్వాలు కఠినచర్యలే తీసుకుంటున్నాయి. అయినా మరింత కఠినంగా వ్యవహరించకుంటే తప్ప ఇలాంటి నేరాలు తగ్గేలా కనిపించడం లేదు. ఏదేమైనా సరే, ఇకనైనా మహిళలపై అఘాయిత్యాలకు అంతం పలకాలి. వారిపై అకృత్యాలు జరగకుండా ఎక్కడికక్కడ కట్టడి చేయాలి. అందుకు ప్రభుత్వాలతో కలసి.. ప్రజలంతా ఒక ఉద్యమంలా ముందుకురావాలి. దేశంలో మహిళలు కన్నీరు పెట్టుకునే దుస్థితి తొలగిపోయినప్పుడే.. దేశ సౌభాగ్యం.. దేశప్రగతి వెల్లివిరుస్తుందని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి.

# మహిళలపై అకృత్యాలకు అంతే లేదా?

**మహిళల పట్ల అకృత్యాలకు పాల్పడేవారికి ఎంత కఠిన శిక్షలున్నా దేశంలో నానాటికీ మహిళల పట్ల అఘాయిత్యాలు, అత్యాచారాలు అధికమవుతూనే ఉన్నాయి తప్ప ఏమాత్రం తగ్గడం లేదు. మహిళలకు సాధికారత రావాలని, మహిళలు కన్నీరు పెట్టుకోకూడదని అంటూనే ఉన్నా..ఆచరణలో మహిళల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుంటోంది. ఇదెంతో దురదృష్ట కరం. తాజాగా మహిళలపై నేరాలకు సంబంధించి ఇటీవల జాతీయ మహిళా కమిషన్‌కు 31వేల దాకా ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తేటతెల్లమవుతుంది. ఇకనైనా ఈ దుస్థితి సమసిపోవాలి. ఈ అఘాయిత్యాలను అన్నిప్రాంతాల్లోనూ ఎక్కడికక్కడ కట్టడి చేయాలి. అందుకు ప్రభుత్వాలతో పాటు ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉద్యమించాలి.**



# సంక్రాంతి శోభ

సీ : సంక్రాంతి కాంతుల సంబర శోభలు
హేమంతమందున హితము గూర్చ
చలి పులిగాలులు చలిమంట సెగలతో
ధనువైన తనువును తనరజేయు
ముంగిళ్ల మురిపించు ముత్యాలముగ్గులు
పొష్యలక్ష్మిని జేరి పరవశించు
గొబ్బెమ్మ పాటలు గోపూజ మహిమలు
హరిదాసు భజనలు అలరజేయు
మార్తాండ తేజమ్ము మకరమ్ము జొచ్చంగ
సంక్రమణ తిథియై సాగగలదు
పితరుల పూజించి ప్రీతినిబొందంగ
తనయులు విడుతురు తర్పణాలు

తే.గీ : పల్లె పట్టణ ప్రాంతాల పౌరులెల్ల
భోగభాగ్యాలనందించు భోగి యనుచు
పొష్యలక్ష్మినే సంక్రాంతి పండుగనుచు
స్వాగతింతురు పులకించి సంతసమున!..

**- వనం సుబ్రహ్మణ్యం**
**ఫోన్ : 94415 94897**

## సత్యసాయి సేవాట్రస్ట్ సేవలు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పెనుబల్లి గ్రామ వరద బాధితులకు నెల్లూరు సత్యసాయి సేవాట్రస్ట్‌వారు ఇటీవల నిత్యావసర సరుకులు పంపిణీచేసి తమ సేవాభావం చాటుకున్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు సుధాకర్, సభ్యులు మురళీకృష్ణ, శేషు, బిజెపి మండలాధ్యక్షుడు రఘురామయ్యతో పాటు ఎంపీటిసి నారాయణ, కృష్ణారెడ్డి, గోపి, పవన్‌బాబు, సాయి, అనిల్ పాల్గొన్నారు.

### అధ్యాపకుడు జానకీరాంకు..

## లూయిబ్రెయిలీ అవార్డు



వెంకటగిరి జూనియర్ కాలేజీలో అధ్యాపకునిగా పనిచేస్తున్న కటారి జానకీరాంకు ఈనెల 4న నెల్లూరులోని మోపూరు పెంచల నాయుడు ట్రస్ట్ వారు లూయిబ్రెయిలీ పేరుతో అవార్డును ప్రదానం చేశారు. స్థానిక మద్రాసుబస్టాండ్ వద్ద ఉన్న జాషువా గ్రంథాలయంలో నిర్వహించిన సభలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు, కవి మోపూరు పెంచలనరసింహం మాట్లాడుతూ లూయి బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని ఈ పురస్కారాలను ఇస్తున్నామన్నారు. దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రతిఏటా ఈ అవార్డును అందజేస్తున్నామన్నారు. జడ్పీ ఉపాధ్యాయుడు రాజా, రచయిత్రి సుభద్రాదేవి, టూరిజం మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలమణి కంఠ, పెన్నా రచయితల సంఘం నిర్వాహకులు అవ్వారు శ్రీధర్ బాబు, తోట సులోచన, బొగ్గరపు ఇందిర, గాయత్రి, స్వాతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో పలువురు కవులు, కవయిత్రుల పాల్గొని తమ కవితలు చదివి వినిపించారు.

## చాముండేశ్వరి అమ్మవారికి.. ప్రత్యేక పూజలు

కొత్త సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలో కొలువైవున్న శ్రీ చాముండేశ్వరి దేవి అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి, పూలంగి సేవ చేసి అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. నరసాపురానికి చెందిన దాసు వెంకటేశ్వర్లు, జనార్దన్, మహాలక్ష్మి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## ప్రతి ఒక్కరూ టీకా వేసుకోవాలి

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

కరోనా విజృంభిస్తూనే ఉంది. ఒమిక్రాన్ తదితర పేర్లతో ప్రజలను భయపెడుతూనే ఉంది. ప్రభుత్వం దీనిని ఎదుర్కొనేందుకు టీకా సిద్ధం చేయడం సంతోషకరం. మన జిల్లాలో ఈనెల 3 నుంచి 7వ తేది దాకా 15 నుంచి 18 ఏళ్ళ లోపు వారికి టీకా వేస్తున్నారు. ఇప్పటికే రెండు డోసుల వ్యాక్సిన్ వేసుకున్నవారికి కూడా త్వరలోనే బూస్టర్ డోసు టీకా కూడా వస్తుంది కనుక ప్రతి ఒక్కరూ టీకా వేసుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో టీకా దొరకడమే ఒక అదృష్టం. ఎవరూ ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా టీకా వేసుకుని కరోనా మనదాకా రాకుండా చూసుకోవాలి. టీకా వేసుకున్నాం కదా మనకేం కాదులే అనుకోకుండా కరోనా నిబంధనలు కూడా తప్పకుండా పాటించాలి. మాస్కులు ధరించడం, గుంపులుగా తిరగకుండా ఉండడం, సామాజిక దూరం పాటించడం, శానిటైజర్లు ఉపయోగించడం వంటి ముందు జాగ్రత్తలన్నీ తీసుకోవాలి. మన ఆరోగ్యం మనచేతుల్లో ఉంటుంది కనుక, కరోనా పూర్తిగా సమసిపోయేదాకా అందరూ జాగ్రత్తగానే ఉండాలి. **- కె.వి శ్రీనివాసరావు, కోవూరు.**

## కరెంటు స్తంభాలు కొత్తవి వేయండి

జిల్లాలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పుడో వేసిన విద్యుత్‌స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అనేకం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇటీవల భారీవానలు, వరదల దెబ్బకు మరికొన్ని దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లో అటు జనావాసాల్లోను, ఇటు పంట పొలాలున్న ప్రాంతాల్లోనూ విద్యుత్‌స్తంభాలు ఒరిగిపోయి వైర్లు బయటకు వేలాడుతుండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా ప్రాంతాల్లో ప్రజలు భయపడుతున్నారు. అధికారులు వాటిపై దృష్టిపెట్టి వెంటనే వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా సముద్రతీర ప్రాంతంలో ఉన్న ముత్తుకూరు మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌స్తంభాలు ఒరిగిపోయి వైర్లు చేతికందేలా ఉన్నాయి. పొరపాటున అవి ఎవరికైనా తగిలితే పెద్ద ప్రమాదం కూడా. అనేక విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఈ మండలంలో శిథిలావస్థలో ఉన్నాయి. చాలామటుకు ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఈ మండలంలోని పైనాపురం తదితర ప్రాంతాల్లో చేతికందే విధంగా ఉన్న సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ప్రమాదకరంగా మారాయి. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో వీటిపై సమగ్రంగా సర్వే నిర్వహించి, ఎక్కడెక్కడ ఎన్ని స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయో పరిశీలించి దెబ్బతిన్న పాత స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని ప్రార్థన.

**వి.ఎస్. రామానుజులు, ముత్తుకూరు.**

## విజయపథంలో నెల్లూరీయులు

'లాయర్' పత్రిక 40వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన 'విజయపథంలో నెల్లూరీయులు' కాఫీటేబుల్ బుక్‌ని ఆంధ్ర ఐ.టి మరియు పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, వెంకటగిరి శాసన సభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, ఆయన సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానాల వైద్య ఆరోగ్య సలహాదారు డాక్టర్ శ్వేతలకు అందజేస్తున్న ప్రభు.







## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

### - జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్



వాలీబాల్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరుస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా బాగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈ నెల 4న ఆయన నగరంలోని ఏసి సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా ఆయన వాలీబాల్ ఆడి, పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు-ఓటములు సహజమని, గెలిచినందుకు పొంగిపోకుండా, ఓడిపోయినందుకు కుంగిపోకుండా క్రీడాస్ఫూర్తితో విద్యార్థులంతా రాణించాలన్నారు. చదువులో కూడా ఎలాంటి అలక్ష్యం వహించకుండా క్రమశిక్షణతో కష్టపడి చదువుకుంటూ విద్యార్థులంతా ఉన్నతమైన లక్ష్యాలను సాధించాలన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఆ కేంద్రం జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డి.పుల్లయ్యలతో పాటు ఎన్‌సిసి నావల్ కెప్టెన్ విజయచంద్రన్, డిఎస్ఎ చీఫ్‌కోచ్ ఆర్.కె.యతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్న అరుణమ్మ



నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఇటీవల నెల్లూరు రూరల్ మండలంలోని కందమూరు, ఉప్పుటూరు గ్రామాలను సందర్శించారు. గ్రామస్తులతో చర్చించి ఆ పంచాయతీల్లో సమస్యలను తెలుసుకున్నారు. కందమూరు గ్రామంలో దళితవాడకి వెళ్లే దారిలో కలుజుకట్ట తెగి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, అక్కడ గ్రావెల్ రోడ్డు వేయాలని గ్రామస్తులు అరుణమ్మను కోరారు. అందుకు స్పందించిన ఆమె అధికారులతో మాట్లాడుతూ వెంటనే ఆ సమస్యను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత అక్కడి సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విధంగా అందరూ సహకరించాలని సూచించారు. అలాగే గ్రామాల్లోని ప్రజలందరూ కోవిడ్ పట్ల జాగ్రత్త వహించాలని ఆమె కోరారు. డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు, మండల అధికారులు, జిల్లా ప్రజా పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు



ఉత్తర భారతదేశంలోని వివిధ రాష్ట్రాల క్యాడర్‌కు చెందిన 19 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఈనెల 4న అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన శ్రీసిటీని సందర్శించారు. భారత్‌దర్శన్ పర్యటనలో భాగంగా వారు శ్రీసిటీకి వచ్చారు. వారికి శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతిని, ప్రత్యేకతలను వివరించారు. వీరి పర్యటనకు సమన్వయకర్తగా నాయుడుపేట ఆర్డీవో సరోజిని పాల్గొన్నారు. ట్రైనీ ఐఏఎస్‌ల అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. శ్రీసిటీ అమలు చేస్తున్న నిర్దిష్టమైన ప్రణాళికలను, ఉపాధి కల్పన తదితరాలను ట్రైనీ ఐఏఎస్ అధికారులు ప్రశంసించి, అందుకు అవిశ్రాంతంగా కృషిచేస్తున్న శ్రీసిటీ యాజమాన్యాన్ని అభినందించారు. వారు తమ పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలను చుట్టిచూడడంతో పాటు ఆల్స్టామ్, కొబెల్కో పరిశ్రమలను కూడా సందర్శించారు.

### ప్రభుత్వ పాఠశాలలకు శ్రీసిటీ ఫౌండేషన్ డెస్కులు

శ్రీసిటీ పరిధిలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలలకు ఇటీవల శ్రీసిటీ ఫౌండేషన్ వారు డెస్కులు పంపిణీ చేశారు. కొల్లడం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు 14, రాళ్లకుప్పంకు 6, పెద్ద ఈటిపాక్కంకు 4, పెద్ద ఈటిపాక్కం దళితవాడ ప్రాథమిక పాఠశాలకు 9 డెస్కులను అందజేశారు. మొత్తంగా 1.30లక్షల రూపాయల విలువైన 33 డెస్కులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందచేశామని శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్రకుమార్ తెలిపారు.



## నవదీప్‌కు నేనున్నా

### - మంత్రి గౌతంరెడ్డి భరోసా

మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఈ నెల 1న తమ స్వస్థలమైన ఆత్మకూరుకు వచ్చి, ఇటీవల బీరాపేరు దుర్ఘటనలో తల్లితండ్రులను, సోదరిని కోల్పోయిన అనాథగా మిగిలిన బాలుడు నవదీప్‌ను పరామర్శించారు. కొత్త దుస్తులు బహుకరిస్తూ 'నవదీప్ బాగా చదువుకో.. నీకు అండగా నేనున్నా'నంటూ భరోసా ఇచ్చారు. ఇప్పటికే నవదీప్ పేరుపై మంత్రి గౌతంరెడ్డి 10లక్షల రూపాయలను డిపాజిట్ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్న విషయం తెలిసిందే. ఇంకా ప్రభుత్వపరంగా కూడా సాయం చేస్తామని, ఇల్లు నిర్మించి ఇస్తామని కూడా మంత్రి హామీ ఇచ్చారు.

## టైలర్స్‌కాలనీలో ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు రూరల్‌లోని 31వ డివిజన్ టైలర్స్ కాలనీలో ఈనెల 2న స్థానిక 'మై హార్ట్ ఫౌండేషన్' వారు పేదలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి తమ సేవాభావం చాటుకున్నారు. వైద్యులు శ్రీరామ్‌కుమార్, సంధ్య రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఛైర్మెన్ ఖాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో పిండి సిద్ధార్థ, పిఆర్‌ఓ దగ్గుపాటి రాధాకృష్ణ, శ్రీనివాసులు, అజంత, సోనియా, కార్తీక్, షరీఫ్, పి.రాధాకృష్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.









# జడ్పీలో కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక పత్రాలను అందజేసిన జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు జిల్లా పరిషత్ పరిధిలో ఇటీవల పలువురికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలిచ్చారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నెల్లూరు చింతారెడ్డిపాళెంలోని తమ నివాసంలో నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు అటెండర్లకు ఉద్యోగ నియామకపత్రాలను అందజేశారు. షేక్ అఫ్రోజ్(ఉదయగిరి), పి.ప్రతిమ (ముత్తుకూరు), ఉదయ మునిస్వామి (రాపూరు), సాయిరోహిత్ (కోట)లతో పాటు, ఏ.రాజ్యలక్ష్మి, శ్యామ్‌ప్రసాద్‌లను ఆఫీస్ సబార్డినేట్లుగా ఉద్యోగాలిచ్చి అభినందించారు. ఈ సందర్భంగా వారు ఛైర్‌పర్సన్‌కు, డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డిలకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జడ్పీ సిఇఓ శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వాసుదేవరావు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు పెంచలయ్య, రమేష్‌బాబు తదితరులు పాల్గొని ఛైర్‌పర్సన్ అరుణమ్మను, ఇతర సిబ్బందిని, అధికారులను అభినందించి వారికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

# సాయిదర్బార్‌లో సాయినాథునికి విశేష సేవలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సాయిదర్బార్ ఛైర్మెన్ మధుసూదనసాయి తదితరులు

నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని నెల్లూరు బాలాజీనగర్ శివార్లల్లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో శ్రీ సాయినాథునికి విశేషపూజలు, సేవలు జరిగాయి. సాయినామ సంకీర్తనలతో ఆలయం మార్మోగిపోయింది. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలంకరణలతో, విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మందిరం ఛైర్మెన్ మధుసూదనసాయి, బాబీసాయి, గౌరవ సలహాదారు రామసుబ్బారావు తదితరుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించి బాబా భక్తులకు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఈ పూజల్లో పాల్గొని సాయినాథుని దర్శించుకున్నారు.

## నెల్లూరు కబుర్లు



### నెల్లూరు కార్పొరేషన్ 54 స్థానాల్లోనూ

# గెలుపు చరిత్రాత్మకం

**• ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వల్లనే అది సాధ్యం**

**- రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

### • విజేతలకు విపిఆర్ విందు

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో 54 డివిజన్లలో 54 స్థానాలనూ వైకాపా గెలుచుకోవడం చరిత్రాత్మకమైన విషయమని, ఇంతటి ఘన విజయం అపురూపమని, గతంలో ఏ పార్టీకి ఇలాంటి విజయం దక్కలేదని, అది ఒక్క సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి, వైకాపా ప్రభుత్వానికే సాధ్యమైందని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 2న నెల్లూరు సమీపంలోని గొలగమూడి రోడ్డులో ఉన్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కొత్తగా ఎన్నికైన మేయర్, డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లకు అభినందన కార్యక్రమం ఏర్పాటుచేసి వారికి చక్కని విందుభోజనం పెట్టారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని వారికి సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం కృషిచేస్తూ ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చారని, అదేవిధంగా కార్పొరేటర్లు కూడా పనిచేయాలని విపిఆర్ సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానాల ఉత్తర భారతదేశ అనుబంధ ఆలయాల అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. అభివృద్ధికి, అసత్యాలకి మధ్య జరిగిన ఎన్నికల్లో వైకాపా ఘనవిజయం సాధించిందని రాష్ట్ర జలవనరుల మంత్రి డా. అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ప్రజలంతా వైకాపా వైపే ఉన్నారనేందుకు నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలే నిదర్శనమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన వారందరినీ అభినందించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అటు పార్టీకి ఇటు జిల్లాకే కాకుండా రాష్ట్రానికంతా చేస్తున్న సేవలు అపూర్వమని మంత్రి గౌతంరెడ్డి కితాబునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, డెప్యూటీ మేయర్లు రూప్‌కుమార్ యాదవ్, ఖలీల్ అహ్మద్, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రంగనాథుని సేవలో కలెక్టర్ దంపతులు



జనవరి 1 కొత్త సంవత్సరం సందర్భంగా జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు దంపతులు నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇ.ఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ శివకుమార్, ఆలయ అర్చకులు కలెక్టర్ దంపతులను సాదరంగా స్వాగతించి పూజలు చేయించి వారికి స్వామివార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

# డిఐజిని కలిసిన.. జిల్లా ఎస్పీ విజయారావు



కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు, జిల్లా పోలీసు అధికారులు ఈనెల 2న గుంటూరు రేంజ్ డిఐజి త్రివిక్రమవర్మను గౌరవపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటరత్నం, శ్రీనివాసరావు, డిఎస్పీలు ఎన్.కోటారెడ్డి, వై.హరినాథ్‌రెడ్డి, డి.ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుభాన్, శివాజీరాజా, గాంధీ, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ అక్కేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సందర్భంగా.. ఆటల సందడి

**• రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు 8 నుంచి**

**• నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్**



పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముక్కాల ద్వారకానాథ్ తదితరులు

సంక్రాంతి పండుగ సందర్భంగా నెల్లూరు నగరంలో ఆటల సందడి ప్రారంభమైంది. సంక్రాంతి సెలవులు కూడా వచ్చేయడంతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో క్రీడలు, క్రీడాపోటీలతో కోలాహలం నెలకొంది. ఈ నేపథ్యంలో స్థానిక రంగనాయకులపేటలోని పిఎంఆర్ హైస్కూల్‌లో ఈనెల 8-9 తేదీల్లో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వర్గీయ కోట శివరామయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కోట సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. పోటీల పోస్టర్లను వారు ఈనెల 4న ఆవిష్కరించారు. పోటీల్లో గెలుపొందిన అయిదు జట్లకు వరుసగా 25వేలు, 15వేలు, 10వేలు, 7 వేలు, 5 వేల రూపాయల వంతున నగదును బహుకరిస్తామన్నారు. వివరాలకు 88863 57777 లేదా 94407 35868 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కోట సూర్యనారాయణ, ఆర్యవైశ్య నాయకులు చలువాది శరత్‌కుమార్, కొలిపాకుల సుబ్రహ్మణ్యం, మెంటా సునీల్, కామిశెట్టి బాబు, శశిధర్, కిషోర్, సతీష్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.






# డీఏలను చెల్లించండి

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించేదుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జికె వీరభద్రయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈనెల 2న నెల్లూరులో జరిగిన ఆ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో ఈనెల 11న సంఘం 16వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, సంఘం ప్రతినిధులందరూ హాజరు కావాలని కోరారు. అనంతరం ఆయన మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శ్రీధర్, జిల్లా రీజనల్ అధ్యక్షుడు సిహెచ్ ప్రసాద్, రీజనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని నెల్లూరు రీజియన్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసి అధికారులు 120 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈనెల 7 నుంచి 14వ తేది వరకు హైదరాబాద్ నుంచి నెల్లూరుకు 65 బస్సులు, బెంగుళూరు నుంచి 25, చెన్నై నుంచి 12, విజయవాడ నుంచి 15 బస్సులు నెల్లూరుకు రాకపోకలు సాగించే విధంగా ఏర్పాటు చేసినట్లు ఆర్టీసి రీజనల్ మేనేజర్ పివి శేషయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైతే ప్రయాణీకుల సౌకర్యార్థం మరిన్ని బస్సులను కూడా నడిపేందుకు ఆర్టీసి సిద్ధంగా ఉందన్నారు.



# పల్లెసీమ చిత్రాల పీసీ రెడ్డి.. ఇక లేరు

**• 90కి పైగా చిత్రాలతో రాణించాడు • చిత్రసీమలో నెల్లూరీయుల ప్రతిభను చాటాడు**

***పీసీరెడ్డి.. అనగానే మన పల్లెలు మనకు గుర్తొస్తాయి. పల్లె వాతావరణంతో నిండిన సినిమాలు జ్ఞాపకానికి వస్తాయి. ఆయన తీసిన అనేక సినిమాలు పల్లెసీమల్ని ప్రతిబింబించేవే కావడం విశేషం. భారతదేశం పల్లెల్లో ఉందని మహాత్మాగాంధీజీ చెప్పినా ఆయన వారసులైన మనం రానురాను పల్లెసీమలను పూర్తిగా విస్మరిస్తున్నామనే చెప్పాలి. అయితే, పీసీరెడ్డి అందుకు భిన్నం. మన సినిమాలు పాశ్చాత్య వ్యామోహంలో పడి ఊహాలోకాల్లో విహరిస్తున్నా, తాను మాత్రం ఆ దారిన పోకుండా పల్లెలో పుట్టి, పల్లెలో పెరిగి, పల్లెలను మనసారా ప్రేమించిన వ్యక్తి కనుక, తాను సినీదర్శకుడైనా పల్లె జీవితాల్లోని మాధుర్యాన్ని కళ్ళకి కట్టినట్లు చూపించి పల్లెల పట్ల, పల్లెప్రజల జీవితాల పట్ల అందరికీ ప్రేమానురాగాలు కలిగేలా చేశారు. పల్లె చిత్రాల దర్శకునిగా చిత్రసీమలో రాణించి అందరి ప్రశంసలందుకున్నారు. నెల్లూరీయుడైన పీసీరెడ్డి 92 చిత్రాలకు దర్శకత్వం చేసి, 88 ఏళ్ళ వయసులో వయోభారంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. భార్య కొద్దికాలం క్రితం మరణించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలో జనవరి 3న కన్నుమూశారు. ఉత్తమదర్శకుడు పీసీరెడ్డి మృతి తెలుగు సినీరంగానికి, ప్రత్యేకించి నెల్లూరుసీమకు తీరని లోటు.***

**'పల్లెసీమ',** 'పాడిపంటలు', 'ఇల్లు-ఇల్లాలు', భోగభాగ్యాలు, 'బడిపంతులు', 'మమత', 'స్నేహబంధం', 'ఒకే రక్తం', 'సౌభాగ్యవతి', 'జన్మజన్మల బంధం', 'పుట్టింటి గౌరవం', 'కొత్త కాపురం', 'మానవుడు-దానవుడు', 'విచిత్ర దాంపత్యం'.. 'బంగారుభూమి', 'స్వర్గసీమ', నాయుడుబావ, ఇలాంటి పేర్లు వినపడాలంటే పీసీరెడ్డి దగ్గరనే అని పేరు. నేటి సినీమాయాలోకానికి ఈ పేర్లు వింతగానే ఉండవచ్చు కానీ.. ఇవన్నీ ఒకప్పుడు దాదాపు సూపర్‌హిట్ చిత్రాలే. అప్పట్లో ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించి, అశేష ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వతముద్ర వేసుకున్న చిత్రాలివి. బడిపంతులులో ఎన్టీఆర్, అంజలీదేవి వృద్ధుల పాత్రల్లో వారి నటన అద్వితీయం. శ్రీదేవి బాల నటిగా 'బూచాడమ్మా బూచాడు, బుల్లి పెట్టెలో ఉన్నాడు.. పాట నాటి తరంవారి చెవుల్లో ఇంకా రింగుమంటూనే ఉంది. 'ఇల్లు-ఇల్లాలు'లో కృష్ణ, కృష్ణంరాజు, వాణిశ్రీల పాత్రలు అద్భుతం. మానవుడు-దానవుడులో శోభన్‌బాబు, శారదల నటనాచాతుర్యం అమోఘం.. ఇలా చెప్పుకునేవారు ప్రేక్షకులు. ఆ సినిమాలు, ఆ పాత్రలు అప్పుడే కాదు ఇప్పటికీ తెలుగు ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నాయి. ఇలా పల్లెలు, పల్లెజీవితాలు, పల్లెమనసులు, ఆ ఆప్యాయతలు.. అభిమానాలు.. అనురాగాలతో పాటు అన్నదాతల కష్టాలు, ఉమ్మడి కుటుంబాల్లోని కష్టసుఖాలు.. అన్నిటినీ అత్యద్భుతంగా వెండితెరకెక్కించి అందరి హృదయాలనూ ఆనంద తరంగితులను చేసిన విలక్షణ దర్శకుడు.. మన పీసీరెడ్డి. ఆయన తీసిన అనేక చిత్రాల్లో పల్లెటూరి వాతావరణమే ఉండడం ప్రత్యేకత. కుటుంబకథా చిత్రాలు తీయడంలో ఆయనకు ఆయనే సాటి. ఎక్కువగా అలాంటి చిత్రాలే తీసి విజయవంతంగా రాణించడం ఆయన ప్రతిభాపాటవాలకు నిదర్శనం.

## చదువుకునే రోజుల్లోనే సినీరంగంపై ఆసక్తి :

పీసీరెడ్డి పూర్తిపేరు.. పందిళ్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి. సొంత ఊరు నెల్లూరు జిల్లా ఏఎస్‌పేట మండలం అనుమసముద్రం గ్రామం. 1933 అక్టోబరు 15న జన్మించారు. తల్లితండ్రులు నారపరెడ్డి-సుబ్బమ్మ. వీరిది రైతు కుటుంబం. ఆయన తండ్రి నారపరెడ్డి గ్రామ మునసబుగా కూడా ఉండేవారు. మూడోతరగతి దాకా ఇక్కడే చదువుకున్నారు. ఆ తర్వాత మద్రాసుకు వెళ్ళిపోయి అక్కడ తమ సోదరుని ఇంట్లో ఉంటూ బీఏ దాకా చదివారు. మద్రాసులో పచ్చయ్యప్పాస్ కాలేజీలో బిఏ చదువుకునే రోజుల్లో చిత్రసీమ వైపు ఆకర్షితులై 1959లో ఆనాటి ప్రముఖ దర్శకులు వి.మధుసూదనరావు, ఆదుర్తిల వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా, ఆ తర్వాత అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసి దర్శకత్వంలోని మెళకువలు ఆకళింపు చేసుకున్నారు. కోవూరు మండలంలోని గుండాలమ్మపాళెం వాస్తవ్యుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి అనూరాధ పిక్చర్స్ పతాకంపై కృష్ణ-విజయనిర్మల జంటగా 1971లో తీసిన 'అనూరాధ' చిత్రానికి పీసీరెడ్డి తొలిసారిగా దర్శకత్వం వహించి ఆ సినిమా విజయవంతం కావడంతో మంచి దర్శకునిగా పేరు తెచ్చుకున్నారు. హీరో కృష్ణతో తీసిన 'అత్తలూ కోడళ్ళు' సినిమా మొదట విడుదలైంది. అక్కినేని హీరోగా 'తాండవకృష్ణ' తీశారు.ఆ తర్వాత ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఆయన దర్శకత్వం చేసిన సినిమాల్లో ఎక్కువ సినిమాలు కృష్ణ నటించినవే కావడం మరో విశేషం. ఇంకా విచిత్ర దాంపత్యం, మానవుడు - దానవుడు, ఇల్లు ఇల్లాలు, బడిపంతులు, బంగారు కాపురం, బంగారుభూమి, పాడిపంటలు, పల్లెసీమ తదితర చిత్రాలెన్నో సినీరంగంలో ప్రత్యేకతను సాధించుకున్నాయి. దాదాపు అన్నీ సూపర్ హిట్‌లు కావడంతో సూపర్‌హిట్ చిత్రాల దర్శకునిగా ఆయన రాణించారు. నేటి మేటి దర్శకులుగా కీర్తిగడించిన కోదండరామిరెడ్డి, ముత్యాల సుబ్బయ్య వంటి వారంతా అప్పట్లో ఆయనకు శిష్యులే.

ఆయన తీసిన చిత్రాలన్నీ దాదాపు హిట్ చిత్రాలే అయినా చివరలో ఓ నాలుగు సినిమాల దాకా ఆగిపోయాయి. వాటిలో ఆయన చివరి చిత్రం 'జగన్నాయకుడు' ఒకటి. దివంగత నేత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవిత విశేషాలతో ఈ చిత్రం రూపొందించడం జరిగింది.

ఏదేమైనా నిజ జీవితంలో కూడా పీసీ రెడ్డి పల్లెమనిషిగానే అందరితో ఆత్మీయంగా మెలిగేవారు. సినీరంగంలో కూడా నెమ్మదస్తునిగా ఉంటూ ఉత్తమ దర్శకునిగా, అందరికీ మార్గదర్శకంగా ఉండేవారు. నెల్లూరంటే ఆయనకెంతో అభిమానం. తానెక్కడ ఉన్నా పుట్టిన గడ్డను మరిచిపోకుండా వీలైనప్పుడల్లా తన పుట్టిన ఊరికి వస్తూ ఉండేవారు.

## 'తుంగా పండుగ'లో పీసీరెడ్డికి సత్కారం



సినీరంగంలో పల్లెదర్శకునిగా ఆదర్శవంతమైన చిత్రాలు తీసి అశేషప్రజల విశేషాదరణ పొందిన ఉత్తమదర్శకుడు పీసీరెడ్డి 'లాయర్' కుటుంబానికి ఎంతో ఆత్మీయులు. ప్రత్యేకించి లాయర్ పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డికి ఆయన చిరకాల మిత్రులు కూడా. 2003 నవంబరు 8న నెల్లూరులోని టౌన్‌హాలులో జరిగిన 'తుంగా పండుగ'లో పీసీరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కళా రంగానికి సంబంధించిన ప్రతిభామూర్తులకు రాజగోపాలరెడ్డి గారి స్మారకంగా అందజేసే గౌరవ సత్కారాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా పీసీరెడ్డి మాట్లాడుతూ అన్న మాటలివి.

**'తల్లిదండ్రులకు గుప్పెడు అన్నం పెట్టడమే భారంగా భావించే కొడుకులున్న ఈ రోజుల్లో తండ్రి పేరుతో ఇంత పెద్ద పండుగ చేయడం విశేషం. 'లాయర్' వారపత్రికలో రాజగోపాలరెడ్డి ఆశయాలు అక్షరరూపంలో ప్రజలకు అందుతున్నాయి. తుంగా రాజగోపాలరెడ్డి నాకు చిరకాల మిత్రులు. ఎన్నో విషయాల్లో ఆయన నాకు మంచి సలహాలు ఇచ్చారు. నెల్లూరీయులకు సినిమా రంగం పెద్దగా అచ్చిరాదని కూడా అంటుండేవారు'..** అంటూ ఆయన రాజగోపాలరెడ్డి గారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ పండుగలో 'లాయర్' పత్రిక నిర్వాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి పీసీరెడ్డిని సాదరంగా స్వాగతించి, ఎంతోమంది ప్రముఖుల సమక్షంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు.

ఏదేమైనా లాయర్ కుటుంబానికి ఎంతో సన్నిహితులైన పీసీరెడ్డి మృతి ఎంతో బాధాకరం. ఆదర్శ దర్శకునికి 'లాయర్' కన్నీటి నివాళులు.



1973లో 'బడి పంతులు' చిత్ర విజయం తర్వాత మద్రాసులోని కళాసాగర్ సభలో పీసీరెడ్డిని సన్మానిస్తున్న సిఎంకెరెడ్డి

## పీసీ రెడ్డి మృతి తీరని లోటు - సిఎంకె రెడ్డి

ప్రఖ్యాత సినీ దర్శకుడు పి.చంద్రశేఖరరెడ్డి(88) మరణం ఎంతో బాధాకరమని, ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేనిదని, ఆయన మరణంతో తెలుగు సినిమా రంగం ఒక ఉత్తమ దర్శకుడిని కోల్పోయినట్లయిందని అఖిలభారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సిఎంకె రెడ్డి తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. నెల్లూరు జిల్లాలో జన్మించి, పలు సందేశాత్మక చిత్రాలకు దర్శకత్వం వహించి, నైతిక విలువలతో రాణించి, నేటి సమాజ రీతులతో రాజీపడలేక చిత్రరంగానికి దూరమైన మేధావి పీసీ రెడ్డి అని ఆయన పేర్కొన్నారు. పీసీ రెడ్డి దర్శకత్వం వహించిన 93 చిత్రాలలో, 55 సూపర్‌స్టార్ కృష్ణతో తీయడం విశేషమన్నారు. ఆయన ఆత్మకు శాంతి ప్రసాదించాలని ఆ భగవంతుడిని వేడుకుంటున్నామన్నారు.

## ఉపకార వేతన పథకానికి.. జనవరి 31లోగా దరఖాస్తులు

ప్రధానమంత్రి ఉపకార వేతన పథకంలో భాగంగా ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి వృత్తి విద్య డిగ్రీకోర్సులకు అర్హులైన మాజీ సైనికులు పిల్లలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును జనవరి 31వ తేదీ దాకా పొడిగించినట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వివరాలకు 0861 2328419 నంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు.



# ఆంధ్రలో 2024 ఎన్నికలు... భాజపా బడాయిలు!!




**2024** ఎన్నికల్లో గెలిచేది బీజేపీయేనని బీజేపీ నాయకులు ఘంటాపథంగా చెప్పడం ఈమధ్య బాగా ఎక్కువైంది. ఈ ప్రకటనలకు ఛానళ్లలో కూడా మంచి ప్రచారమే లభిస్తోంది. కొంతకాలం క్రితం బీజేపీ నేతలు చేస్తూ వచ్చిన ప్రకటనలకు, ఇప్పుడు చేస్తున్న ప్రకటనలకు మౌలికంగా కొంత తేడా కొట్టొచ్చినట్టు కనపడుతోంది.

జనసేనతో కలిసి బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని గతంలో బీజేపీ నేతలు చెప్తూ ఉండేవారు. ఇప్పుడు చేస్తున్న ప్రకటనల్లో 'జనసేన' అనే మాట వినబడడం లేదు. వైసీపీకి తామే ప్రత్యామ్నాయమని, అధికారంలోకి రాగానే, అమరావతిని మూడేళ్లలో కట్టేస్తామని కూడా బీజేపీ నాయకులు అంటున్నారు. వైసీపీపై విమర్శల దూకుడును పెంచడం ద్వారా బీజేపీ అధికారంలోకి రాగలదని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారో... లేక, అలా అంటూ వెడుతుంటే మీడియాలో గట్టి ప్రచారం లభిస్తుంటుంది అని అనుకుంటున్నారో తెలియదు.

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఓట్ల శాతం ఒకటి. ఒకటికి కొంచెం అటూ, ఇటూ.

నిజానికి, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నవి రెండే రాజకీయపార్టీలు. ఒకటి వైసీపీ. రెండు టీడీపీ. గెలిస్తే, వైసీపీ గెలవాలి. లేదంటే, టీడీపీ గెలవాలి. రెండింటికీ బలమైన ఓట్ బ్యాంకులు ఉన్నాయి. స్థిరమైన నాయకత్వాలు ఉన్నాయి.







రెండు పార్టీలకు ఓట్ల శాతం తేడా కూడా 10 శాతం లోపు. టీడీపీతో కమ్యూనిస్టులు కలిసి ప్రయాణం చేస్తున్నారు. వారి ఓట్ శాతం బీజేపీ ఓట్ శాతం కంటే ఎక్కువేనని వాదించేవారు కూడా లేకపోలేదు. ఇక, క్షేత్రస్థాయిలో విస్తరించడానికి ఏమాత్రం వీలు లేని స్థానంలో 'జనసేన' ఉంది. 2019లో ఎంత అడ్డదిడ్డంగా ఎన్నికల్లో పాల్గొన్న ప్పటికీ 6 శాతానికి పైబడి ఓట్లు వచ్చాయి. కొంచెం వ్యూహాత్మకంగా... తెలివిగా వ్యవహరించి ఉన్నట్లయితే ఆ శాతం 10కి అటూ ఇటూగా ఉండి ఉండేది. ఈసారి బీజేపీతో జనసేన కలిసి నడుస్తుందని కొంత ప్రచారం గతంలో గట్టిగా సాగినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ వాతావరణం కనిపించడం లేదు. బీజేపీ నేతల నోటి వెంట కూడా జనసేన మాట పెద్దగా వెలువడడం లేదు.

ఎన్నికలు ఇంకా రెండు సంవత్సరాల దూరంలో ఉన్నాయి. ఈ రెండేళ్లలో పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఏమి చేసినా... చేయకపోయినా ఎన్నికలలో మాత్రం జనసేన టీడీపీతో కలిసి పోటీ చేస్తుందనే భావం మాత్రం రాష్ట్రంలో చాలా బలంగా ఉంది. ఈ పరిస్థితుల్లో బీజేపీకి వచ్చే శాసనసభలో ప్రాతినిధ్యం ఉండాలి అని అనుకుంటే దానిముందు రెండే మార్గాలు ఉన్నాయి. అయితే వైసీపీతో కాకపోతే టీడీపీతో పొత్తు పెట్టుకోవడం. ఇవేమీ లేకుండా పోటీ చేస్తే ఇప్పటి శాసనసభలో బీజేపీ బలమెంతో.. వచ్చే శాసనసభలోనూ అంతే.

బీజేపీ బలం ఆంధ్రాలో పెరగకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆంధ్ర ఓటర్లకు రాజకీయ చైతన్యం ఎక్కువ. మతాల మధ్య ద్వేషభావాలు దాదాపుగా లేవు అని చెప్పవచ్చు. హిందువులు హిందువులే తప్ప హిందుత్వ వాదులు కాదు. గుంటూరులో ఉన్నది 'జిన్నా టవర్' అయినా లేదంటే దానికి 'వాజపేయి టవర్' అని పేరు పెట్టినా జనానికి అనవసరం. అదేమీ టూరిస్టు సెంటర్ కాదు. నడిరోడ్డు మీద ఉన్న ఒక స్తంభం. దానికి రూపాయి ఆస్తి లేదు. ఒక ఉద్యోగి లేడు. ఒక భౌగోళిక గుర్తు మాత్రమే. 'జిన్నా టవర్' అంటే గుంటూరులో ఫలానా ప్రదేశంలో ఉన్నది అనే భావన కలగడానికే తప్ప దానివల్ల ఎవరికీ దమ్మిడీ ప్రయోజనం లేదు. బీజేపీకి మాత్రం అదో పెద్ద ఇష్యూ. ఆంధ్రలో ఇటువంటి ప్రయోగాలకు జనాదరణ లభించదు. అందువల్ల బీజేపీ ఓట్ బ్యాంక్‌లో ఇప్పటికిప్పుడు పెద్ద మార్పులు ఉండవు. అయితే, వై.ఎస్.జగన్‌కు వ్యతిరేకంగా షర్మిలను తమవైపు తిప్పుకుని, ఓ భారీ సంచలనం సృష్టించడానికి బీజేపీ వ్యూహం పన్నుతున్నదంటూ సోషల్ మీడియాలో కథనాలు హోరెత్తిపోతున్నాయి. అది వర్క్ ఔట్ కాకపోవచ్చు. అందువల్ల, వైసీపీతో పొత్తుపెట్టుకోవడం బీజేపీకి ఒక మార్గం. లేదంటే టీడీపీతో పొత్తు మరో మార్గం. 2014లో టీడీపీతో పొత్తువల్ల ఓ అయిదు ఎం.ఎల్.ఏ సీట్లు, ఓ ఎం.పీ సీటు, రెండు మంత్రి పదవులు, రెండు.. మూడు ఎం.ఎల్.సీ పదవులు బీజేపీకి లభించాయి. అదృష్టం కలిసి వస్తే అధికార పక్షంలో భాగస్వామిగా కూడా ఉండవచ్చు.

అయితే, ఆంధ్ర బీజేపీకి నేతృత్వం వహిస్తున్న సోము వీర్రాజుకు టీడీపీ వాసన కూడా గిట్టదు. వైసీపీని ఆయన ఈమధ్య కాలంలో గట్టిగానే విమర్శిస్తున్నప్పటికీ వైసీపీ కంటే టీడీపీయే ఆయనకు మొదటి రాజకీయ శత్రువు. ఈ పరిస్థితుల్లో బీజేపీ ప్రయాణంపై ఇప్పుడే అంచనాకు రావడం కష్టం. ఇప్పటికైతే అదీ బీజేపీ పరిస్థితి. అయితే, బీజేపీ ఎన్నికల వ్యూహం అనేది రాష్ట్ర నేతల చేతుల్లో లేదు. కేంద్ర నాయకులు నిర్ణయిస్తారు. పొత్తులు కూడా కేంద్ర స్థాయిలోనే ఉంటాయి. టీడీపీతో పొత్తు ఉండడం బెటర్ అని కేంద్ర నాయకత్వం భావించే పక్షంలో సోము వీర్రాజును కేంద్ర పార్టీలోకి తీసుకుని సారధ్య బాధ్యతలు మరొకరికి అప్పగించ వచ్చు. అదీగాక ఇప్పటి నుంచి, ఎన్నికల సమయంలోగా రాజకీయ సమీకరణలు అనేక మార్పులు, చేర్పులకు లోనవ్వవచ్చు. కానీ, ఒకటి మాత్రం స్పష్టంగా చెప్పొచ్చు. టీడీపీ, జనసేన, సీపీఐ ఒక జట్టుగా ఎన్నికల బరిలోకి దిగడం ఖాయం అనే మాట గట్టిగా వినబడుతోంది. అటువైపున వైసీపీ. దానికి పొత్తులతో పని పడకపోవచ్చు. ఈ 'హోరాహోరీ' పోరులో ఎటువైపు మొగ్గితే బీజేపీకి లాభమో జాగ్రత్తగా అంచనా వేసుకుంటూ తమ వ్యూహాలను, విమర్శలను కొనసాగించడం బీజేపీకి మంచిది. లేకపోతే, వన్ పెర్సెంట్ ఓట్లతో ఎప్పటికి అధికారంలోకి రావాలి! ఎప్పుడు సర్వాంగసుందరమైన అమరావతి నిర్మించాలి!!?.

**సోము వీర్రాజుకు అభినందనలు!**

అధికారంలోకి వచ్చాక చీప్ లిక్కర్ 50 రూపాయలకే ఇస్తాం, అంటూ సోము వీర్రాజు చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా సంచలనమైంది. కానీ, దానిలో ఆచరణీయమైన ఆలోచన ఉంది. మధ్య, దిగువ మధ్య, పేద, నిరుపేద, కూలీ... నాలీ చేసుకుంటూ జీవనం సాగించే వర్గాలలో చాలా మందికి చీప్ లిక్కర్ అనేది ఓ నిత్యావసర వస్తువు. అది లేకుండా పూట గడవదు. అది 50 రూపాయలకే దొరుకుతుందంటే వారికి అంతకు మించిన ఆనందం మరొకటి ఉండదు. ఈ ప్రకటన చీప్ లిక్కర్ వర్గాల ప్రజల్లోకి బాణంలా దూసుకువెడుతుంది. ఇదే విషయాన్ని వీర్రాజు పదే పదే ప్రస్తావిస్తూ ఉండాలి. అప్పుడు ఈ ప్రకటనలోని 'పవర్'ను మిగిలిన పార్టీలు గుర్తిస్తాయి. నిజానికి ఇదో అద్భుత జనాకర్షక ఆలోచన. ఒక ముఖ్య సమస్యను ప్రస్తావించిన వీర్రాజుకు అభినందనలు.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి పిహెచ్‌డి



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న మొగలి గుంట శంకరయ్యకు ఇటీవల జెఎన్ టియు-ఏ పిహెచ్‌డి లభించింది. 'కో-ఆర్డినేట్ కంట్రోల్ ఆఫ్ డి.జేసీ అండ్ ఓల్టేజ్ కంట్రోల్ డివైజెస్ యూజింగ్ డిఫరెంట్ ప్రోగ్రామింగ్ అల్‌గారిథమ్స్' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు ఈ అవార్డు వచ్చింది. ఎన్‌బికెఆర్ కాలేజీ ఎలక్ట్రికల్ విభాగాధిపతి డా.సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, అనంతపురం జిల్లా జెఎన్‌టియు-ఏ యూనివర్శిటీ రెక్టార్ డా.ఎం. విజయకుమార్ పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధనాపత్రం సమర్పించారు. తమ అధ్యాపకుడు పిహెచ్‌డి సాధించినందుకు ఎన్‌బికెఆర్ కాలేజీ కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్ రెడ్డిలు సంతోషం వ్యక్తం చేస్తూ శంకరయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

# బాల్‌బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన విద్యార్థినులు



ఇటీవల విశాఖపట్టణం జిల్లా యలమంచిలిలో జరిగిన 7వ అంతర్‌రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ సీనియర్ మహిళల విభాగం పోటీల్లో నెల్లూరుజిల్లా తరఫున పాల్గొన్న ఎన్‌బికెఆర్ విద్యార్థినులు తమ సత్తా చాటారు. ఈ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచేందుకు ఎన్‌బికెఆర్ విద్యార్థినులు వి.శ్రీనిత్య, ఏ.దివ్య కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, కళాశాల వ్యాయామ విభాగాధిపతి డా.వి.మల్లికార్జున విద్యార్థినులను అభినందించారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# ప్రతి ఒక్కరు సేవాభావం అలవర్చుకోవాలి



వృద్ధురాలితో కలిసి కొత్త సంవత్సర కేకును కట్ చేస్తున్న డా. సి.రోహిణి

ఉన్నంతలో ప్రతి ఒక్కరు సేవా భావాన్ని అలవర్చుకోవాలని, మనం చేసిన దానాలకు భగవంతుడు రెట్టింపు ఫలితం ఇస్తారని ప్రముఖ వైద్యురాలు చెరుకూరు రోహిణి అన్నారు. వృద్ధాశ్రమాలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ రోహిణి దాతృత్వంతో లక్ష రూపాయల వ్యయంతో ఫ్లోరింగ్ టైల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌లు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయని వివరించారు. ఇక్కడి వృద్ధులకు ఆవుల విజయ దాతృత్వంతో దుస్తులను అందించారు. లాస్‌ఏంజెల్స్‌లో ఉంటున్న శ్రీధర్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భోజన వసతి ఏర్పాటు చేశారు. అనంతరం వృద్ధాశ్రమానికి సహకరించిన కుమార్, నర్సింహులు, కళ్యాణిలను ఘనంగా సత్కరించారు. ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు నాగసూరు లక్ష్మి, కార్యదర్శి కొనెదల అనిత, జీవన్‌రెడ్డి, శశికళ, జమునమ్మ పాల్గొన్నారు.

# బీజేపీ కార్యవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు బాలకృష్ణనాయుడు

గూడూరు బీజేపీ ఆఫీసులో అర్బన్ కార్యవర్గ సమావేశం ఈ నెల 3వ తేదీ జరిగింది. ఈ సమావేశంలో గూడూరు పట్టణంలోని వివిధ వార్డుల్లో ఉండే ప్రధాన సమస్యలను, రాజకీయ తీర్మానాలను, ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరిపాలనలో ప్రజలకు ఉపయోగపడే అనేక పథకాలను ప్రజలకు అర్థమయ్యేటట్లు వివరించాలని, రాబోయే ఎన్నికల్లో పట్టణంలోని 34 వార్డుల్లో ఎవరు నిలబడితే ఓట్లు తెచ్చుకోగలరోనని తీర్మానించుకున్నట్లు గూడూరు పట్టణ అధ్యక్షులు ఆరికట్ల బాలకృష్ణనాయుడు, ప్రధాన కార్యదర్శి వీరిబోయిన వెంకటేష్‌యాదవ్‌లు తెలిపారు. ప్రభాకరరావు, ఇండ్ల హేమ చంద్రకుమార్, మనుబోలు సురేష్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్, మల్లి, గుంజి శ్రీనివాస రావు, షేక్ మీరాసాహెబ్, బాలమణి, శ్రావణి, గోపి, సుబ్బయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# బాలికా విద్యతోనే సామాజిక వికాసం



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కోడూరు కల్పలత

బాలికా విద్యతోనే సామాజిక వికాసం సాధ్యపడుతుందని మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కోడూరు కల్పలత అన్నారు. ఈ నెల 3వ తేదీ చిల్లకూరు శేషమ్మ పాఠశాల ఆవరణలో బి.సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చదువుల తల్లి, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే 191వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోడూరు కల్పలత మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1831 జనవరి 3న జన్మించారని, ఆమె భారతీయ సంఘసంస్కర్తగా, ఉపాధ్యాయినిగా, రచయిత్రిగా రాణించారన్నారు. అనంతరం ఉపాధ్యాయులను, పలు రంగాలలో రాణిస్తున్న ఆరుగురు మహిళలను సన్మానించారు. బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాసయాదవ్, ప్రసాద్, పట్టణ అధ్యక్షులు ముని, నాసిన భాస్కర్‌గౌడ్, మగ్దుమ్ మొహిద్దీన్, ఇన్సాఫ్ సమితి జిల్లా కార్యదర్శి షేక్ జమాలుల్లా, షేక్ కాలేషా, అన్వర్ భాషా, ఎల్.వి.సుబ్బయ్య, ఎంబేటి చంద్రయ్య, చాంద్‌భాషా, మన్సూర్ పాల్గొన్నారు.

# లక్షా 41 వేల మందికి.. కోవిడ్ టీకా



వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు

కోవిడ్ నివారణకు జిల్లాలో 15 నుంచి 18 ఏళ్లలోపు వయసున్నవారికి ఈనెల 3 నుంచి టీకా వేస్తున్నామని, మొత్తంగా 1,41,851 మందికి టీకా వేయాలని లక్ష్యంగా నిర్ణయించామని డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి చెప్పారు. ఇటీవల ఆమె నెల్లూరులోని తమ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ అందుకు తగ్గ ఏర్పాట్లన్నీ ఎక్కడా ఎలాంటి లోటు లేకుండా చేయాలన్నారు. జిల్లాలోని జడ్పీ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కోవాగ్జిన్ మొదటి డోసుగా వేస్తామని చెప్పారు. అదేవిధంగా ఈనెల 10 నుంచి 12వ తేది వరకు ఆరోగ్యసిబ్బందికి, అంగన్‌వాడి కార్యకర్తలకు, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు ముందుజాగ్రత్తగా మరో డోసు టీకా వేయనున్నట్లు చెప్పారు. రెండు డోసులు టీకా వేయించుకున్నవారికి 9 నెలల తర్వాత ఈ టీకా వేస్తామన్నారు.

## కలెక్టర్ సమక్షంలో టీకా

జిల్లాలోని 15 నుండి 18 సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలందరికీ కోవిడ్ టీకా వేయించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ నెల 3న స్థానిక పొదలకూరు రోడ్డులోని దర్గామిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కోవిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్‌బాబు ప్రారంభించి విద్యార్థినీవిద్యార్థులకు దగ్గరుండి టీకా వేయించారు.

# గూడూరులో 8, 9 తేదీల్లో షటిల్ టోర్నమెంట్



సమావేశంలో పాల్గొన్న ప్రగతి సేవా సమితి ప్రతినిధులు

గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఈ నెల 8, 9 తేదీలలో షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తామని, గూడూరు మున్సిపాలిటీ గ్రేడ్–1 పరిధిలోని క్రీడాకారులందరికీ ఆహ్వానం పలుకుతున్నామని ఆ సంస్థ ప్రతినిధులు ఈ నెల 4వ తేదీన సమావేశమై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులు పురందర్‌రాజు, గ్రానైట్ ప్రభాకర్, పిల్లిల శీను, ఆక్వా సురేష్, చంటి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రజల మనసు గెలుచుకున్న జననేత జగన్

## - కొనియాడిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం అనునిత్యం కృషిచేస్తూ, ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనసు గెలుచుకున్నారని, జననేత జగన్‌గా అందరి అభిమానం పొందుతున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 4న ఆయన కొడవలూరు మండల కార్యాలయంలో లబ్దిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పుయాత్ర చేస్తున్నప్పుడు పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి మాత్రమే పూలమాలలు వేస్తుంటే పక్కనే ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి కూడా పూలమాలలు వేయాలని కార్యకర్తలకు చెప్పిన మనసున్న మంచినేత జగన్ అనీ, అయితే చంద్రబాబు మాత్రం ముఖ్యమంత్రిపై లేనిపోని దుష్ప్రచారం చేస్తుండడం విచారకరమన్నారు. ఎవరో మద్యం మత్తులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తే, అది ముఖ్యమంత్రే చేయించినట్లుగా విమర్శలు చేయడం దారుణమన్నారు. కుట్రలు కుతంత్రాలకు చంద్రబాబు మారుపేరని, ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబును ఎవరూ నమ్మరని ప్రసన్న విమర్శించారు. డిసిఎమ్మెస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చీరలు పంపిణీ

కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాళెం గ్రామంలో ఉన్న సెంటినరీ బాప్టిస్టు చర్చిలో జనవరి 1 కొత్త సంవత్సరం సందర్భంగా కోవూరు రామయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి చిన్నమ్మ పేదలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్, సన్డే స్కూల్ సూపరిం టెండెంట్ సుప్రియ చేతుల మీదుగా వాటిని పేద మహిళలకు అందజేశారు. అనంతరం కేకును కట్ చేసి కొత్త సంవత్సరం సంబరాలను జరుపుకున్నారు. ఎంపిపి జ్యోతి, పాస్టర్ ప్రేమ్‌నాథ్, ఛైర్మెన్ సుదర్శనం, సెక్రటరీ సురేష్, అహరోన్ తదితరులు పాల్గొన్నారు.

# వేదగిరి లక్ష్మీనృసింహునికి.. పెరిగిన రాబడి

## హుండీ ద్వారా 15.30 లక్షల ఆదాయం



నెల్లూరు రూరల్ మండలంలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్న హుండీలను ఈనెల 4న లెక్కించగా భక్తులు సమర్పించిన కానుకలు 15.30 లక్షల రూపాయలు వచ్చాయని, గత ఏడాది ఇదే సమయంలో హుండీలు లెక్కించినప్పుడు 11.83 లక్షల రాబడి వచ్చిందని, అప్పటికీ ఇప్పటికీ స్వామివారి ఆలయానికి 3.47 లక్షల ఆదాయం పెరిగిందని, భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని ఆలయ ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

# లైఫ్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు.. ప్రత్యేక శిబిరం

జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు వారి లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించుకునేందుకు నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని పెన్షన్‌భవన్‌లో ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేశామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డా. పి. మోహన్‌రావు, టి.కొండాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలాఖరు దాకా ఈ శిబిరం కొనసాగుతుందని, సర్టిఫికెట్ కోసం వచ్చే పెన్షనర్లు వారి పింఛన్ బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, సెల్‌ఫోన్ తీసుకురావాలని కోరారు.

# వెయ్యేళ్ళ కిందటి.. చెన్నూరు శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయం

'సోమోత ఏవ యోహగ్ం
సర్వేషా మధిష్టాతా
సర్వేషాం చ భూతానాం పాలకః'..

అంటున్నాయి ఉపనిషత్తులు. సకల లోక సృష్టికర్త, సర్వభూత పాలకుడు, సర్వ లోకేశ్వరుడు ఆ సదాశివుడేనంటున్నాయి శాస్త్రాలు. ఈ సృష్టి అంతా శివమయమే. అన్ని లోకాలు..అన్ని రూపాలు ఆయనవే. ఆదిదేవుడు..దేవాదిదేవుడు కూడా ఆయనే. అందులోనూ గ్రహసంచారాలన్నీ కూడా శివాధీనంలోనే ఉంటాయి. అందుకే ఎవరైతే చంద్రుడుని కానీ, శివుడినిగాని ఆరాధిస్తారో వారికి గ్రహ, నక్షత్ర దేవతల అనుగ్రహం తప్పకుండా ఉంటుందంటున్నాయి పురాణాలు. అలాంటిది ఇక సాక్షాత్తూ ఆ చంద్రుడే పరమశివుడిని ప్రతిష్టించి పూజలు చేస్తే ఆ కోవెల ఇంకెంత మహత్తరమైనదో ఊహించుకోవచ్చు. అలాంటి అరుదైన, అత్యంత పురాతనమైన ఆలయం నెల్లూరుజిల్లాలో ఉండడం అదృష్టం. అదే.. గూడూరు మండలంలోని చెన్నూరులో వెలసి ఉన్న కామాక్షిదేవి సమేత శ్రీ సోమేశ్వరస్వామి దేవాలయం. పరమశివుని అనుగ్రహం కోసం సాక్షాత్తూ చంద్రుడు(సోముడు) ప్రతిష్ఠించిన దేవాలయం కనుక సోమేశ్వరాలయంగా ప్రతీతి. ఎంతో మహిమాన్వితమైన ఈ ఆలయం అనాదిగా అందరి పూజలందుకుంటూ. కష్టాలు తీర్చి, కోర్కెలు నెరవేరుస్తూ భక్తులందరికీ కొంగుబంగారంగా ఉంది.

గూడూరు నుంచి సుమారు 6కిలోమీటర్ల దూరంలో రాపూరుకు వెళ్ళేదారిలో గోగినేనిపురం దాటాక చెన్నూరు గ్రామం వస్తుంది.

## ఆలయ చరిత్ర :

11వ శతాబ్దిలో మొదటి కుళోత్తుంగచోళుని కాలంలో ఈ ఆలయం నిర్మించినట్లు శాసనాధారాలు ఉన్నాయి. ఆలయమంతా అత్యద్భుతమైన చోళ రాజుల శిల్పకళతో అలరారుతూ ఉంటుంది. పెద్దపెద్ద గండశిలలతో, వృత్తాకారపు స్తంభాలతో,





మన దేవాలయాలు 81

అపురూపమైన శిల్పాలతో ఆలయం నాటి రాజుల ప్రాభవవైభవాలను చాటుతూ ఉంటుంది. సుమారు అయిదెకరాల విశాలమైన స్థలంలో సర్వాంగసుందరంగా నిర్మించిన ఈ ఆలయంలో ప్రాచీనమైన రాతిమండపం (వాహనమండపం) కూడా ఉంది. ఆలయ గోడలపై నాటి ద్రవిడ భాషా శాసనాలు కూడా ఉన్నాయి. గర్భగుడికి ముందు పదడుగుల ఎత్తున్న ద్వారపాలకుల విగ్రహాలు నయనమనోహరంగా దర్శనమిస్తాయి. గర్భాలయం ఎదుట శివునికి ఎదురుగా పెద్ద నందీశ్వరుని విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. సాధారణంగా శివాలయాల్లో దక్షిణ గోపురద్వారం ఉంటుంది. ఇక్కడ దక్షిణ ద్వారంతో పాటు తూర్పున కూడా సింహద్వారం ఉండడం విశేషం. గర్భాలయంలో పరమశివుడు లింగరూపధారి అయిన సోమేశ్వరునిగా, పార్వతీదేవి కామాక్షిదేవి అమ్మవారిగా ఇక్కడ కొలువై ఉన్నారు. గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే వీలు కూడా ఉంది. అదేవిధంగా గణపతి, మేధా దక్షిణామూర్తి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు, కాలభైరవుడు, శ్రీ వేంకటేశ్వరుడు, బ్రహ్మ, చండీశ్వరుడు, దుర్గాదేవి మందిరాలు ఉపాలయాలుగా ఉన్నాయి. వాటితో పాటు నవగ్రహ మండపం, నాగమండపం ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఆలయ ప్రాంగణంలో కల్యాణమండపం, అయ్యప్ప స్వామికి కూడా మందిరం నిర్మించడంతో ప్రతిఏటా అయ్యప్ప భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి పూజలుచేసి ఇరుముడులు కట్టుకుంటుంటారు. ఎంతోకాలంగా గ్రామస్తులు, భక్తులందరి సహకారంతో ఆలయం అభివృద్ధి చెందుతూ ఉంది. ఇటీవలి కాలంలోప్రముఖ దాత ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి ఈ ఆలయ అభివృద్ధికి చేసిన కృషి అపారం. ఆ తర్వాత దాతలు మెట్టు రవీంద్రరెడ్డి–రజని దంపతులు కూడా ఎంతో ధనం వ్యయం చేసి ఆలయ అభివృద్ధికి చేస్తున్న సేవలు అపూర్వం.

## కుజదోష నివారణకు ప్రత్యేక పూజలు :

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రతిఏటా వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు చేస్తుంటారు. ఈ వారం రోజులు గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులందరూ కలసి ఎంతో భక్తిశ్రద్ధలతో 'సాంబసదా శివ' సప్తాహ భజన కార్యక్రమాన్ని ప్రతినిత్యం 24 గంటల పాటు నిర్విరామంగా నిర్వహిస్తుండడం ఇక్కడి ప్రత్యేకత. గత యాభై ఏళ్ళుగా ఈ సప్తాహం జరుగుతూనే ఉంది. స్వామివార్లకు, అమ్మవార్లకు నిత్యపూజలకు కొదవలేదు. ఆలయ అర్చకులు కుందుర్తి రామచంద్రమూర్తి, నాగరాజస్వామిల ఆధ్వర్యంలో పూజలు జరుగుతుంటాయి. కార్తీకమాసం పూజలు, ప్రతి సోమవారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, ప్రతి మంగళవారం ప్రత్యేకించి నాగదోష, మాంగలిక దోష (కుజదోషం) పూజలు, చంద్రదోష పరిహారార్థం పూజలు అభిషేకాలు జరుగుతుంటాయి. చెన్నూరువాసులే కాక అనేక గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి స్వామివార్లను దర్శించుకుని తరిస్తుంటారు.

# కళ్యాణ వైభవం...!

### భరత్ - గ్రీష్మ



రహదారులు మరియు భవనాల శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(రిటైర్డ్)
పోరెడ్డి సుధాకర్‌రెడ్డి - జిల్లా ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనూరాధ దంపతుల కుమారుడు
**భరత్‌రెడ్డి - డా॥ గ్రీష్మ**ల కళ్యాణం డిసెంబర్ 29వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది.
నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

### సోమన - అభిరామ్



నెల్లూరు వాస్తవ్యులు కొండా విష్ణుకుమార్‌రెడ్డి - శ్యామలల కుమార్తె
**సోమన - అభిరామ్**ల పరిణయం డిసెంబర్ 24వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది.
కొత్త జంటకు 'లాయర్' శుభాకాంక్షలు.

# వెన్నెలకంటితో అనుబంధం మరచిపోలేనిది

## - వర్ధంతి సభలో ఆత్మీయులు

ప్రముఖ సినీకవి వెన్నెలకంటితో తమకున్న అనుబంధం ఏనాటికీ మరచిపోలేనిదని వెన్నెలకంటి ఆత్మీయులు పేర్కొన్నారు. ఈనెల 5న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన వెన్నెలకంటి ప్రథమ వర్ధంతి సభలో ప్రసిద్ధ సినీకవి భువనచంద్రతో పాటు పలువురు మిత్రులు, సహచరులు పాల్గొని వెన్నెలకంటితో ఉన్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. సినీకవిగానే కాక వెన్నెలకంటి మంచి సారస్వతవేత్త అని, అప్పటికప్పుడు ఎలాంటి సాహితీప్రక్రియనైనా అలవోకగా అందించగలిగే ప్రతిభ ఆయన సొంతమని భువనచంద్ర అన్నారు. వెన్నెలకంటి సాహితీ నిధి అని ఆయన ప్రశంసించారు. వెన్నెలకంటి అంటే తనకెంతో అభిమానమని అన్నారు. వెన్నెలకంటి పాటలు, మాటలు ఎంతో విలక్షణమైనవని, అవన్నీ తెలుగువారి హృదయాల్లో శాశ్వత ముద్ర వేసుకున్నాయని అన్నారు. వెన్నెలకంటి మృతి తెలుగు సినీ ప్రపంచానికి తీరని లోటని, ప్రత్యేకించి ఆయన మరణం తనను ఎంతగానో కలచివేసిందని అన్నారు. తొలుత వెన్నెలకంటి చిత్రపటానికి వక్తలందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభకు ఎంవిఎస్ ప్రసాద్ అధ్యక్షత వహించగా, చేతన సంస్థ కార్యదర్శి వై.శేషగిరీశం సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగభైరవ ఆదినారాయణ, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, హరినారాయణరెడ్డి, చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, ఎంకె ప్రసాద్‌రావు, డా.ఎం.సుబ్రహ్మణ్యం, ఎస్.సుబ్బారావు, వెంకటరామయ్య తదితరులతో పాటు వెన్నెలకంటి కుమారుడు రాఖేందుమౌళి తదితరులు పాల్గొన్నారు. తొలుత కవితల పోటీ విజేతలకు భువనచంద్ర చేతుల మీదుగా బహుమతులందజేశారు.




కవితల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న సినీ కవి భువనచంద్ర

# క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ఇటీవల నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఆలయ ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి, తదితరుల చేతుల మీదుగా ఈ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది.



# అక్కడా.. ఇక్కడా..? సందిగ్ధంలో షర్మిల!

(మొదటి పేజీ తరువాయి)

తరుణంలో... 'ఆంధ్రాలో పార్టీ ఎందుకు పెట్టకూడదు' అని ఆమె అన్న మాటలు ఆమె అసలు లక్ష్యాన్ని అనుమానించే పరిస్థితులు కల్పించాయి.

## ఇప్పుడామె లక్ష్యం ఏమిటి...?

ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలోని రాజకీయ వర్గాలలో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న ఇదే. షర్మిల లక్ష్యం ఏమిటి...? తండ్రి ఆశయాలతో, అన్న ఆదర్శంగా తాను కూడా అధికారంలోకి వచ్చి తెలంగాణ ముఖ్యమంత్రి కావడమా...? లేక ఆంధ్రాలో కూడా పార్టీని ప్రకటించి అన్నకు వ్యతిరేకంగా నినదించి ఆయనను అబాసుపాలు చేయడమా...? మొదటి దానికన్నా రెండవ అంశానికే ఆమె ఎక్కువ ప్రాధాన్యత కల్పించే అవకాశాలు ఉన్నాయన్న వాదన కూడా రాజకీయవర్గాల్లో బలంగా వినపడుతోంది. నిజానికి ఒకప్పుడు ఆమె జగనన్న వదిలిన బాణం. అన్న జైల్లో ఉన్నప్పుడు అన్న కోసం తన ప్రాణాలను పణంగాపెట్టి వేల కిలోమీటర్ల కాలి నడకతో పార్టీకి ప్రాణం పోసిన బాణం. మరి ఇప్పుడు అదే అన్నపై ఆమె తిరుగుబాటు ఎందుకు చేయవలసి వచ్చింది అన్నది కొత్త కోణం...! ఇది పూర్తిగా వారి వ్యక్తిగతం అయినప్పటికీ వారిద్దరి ప్రవర్తన వల్ల అది బహిర్గతం అవుతోందన్నది కూడా రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ప్రతి ఇంట్లోనూ గొడవలుంటాయి, అవన్నీ ఇంటింటి రామాయణాలే, కానీ మహానేత రాజశేఖరరెడ్డి సంతానం ఇలా వీధికెక్కడం ఆయన కుటుంబ అభిమానులను కలచివేస్తోంది.

నాన్న, అన్న బాటలలో ప్రజాసేవే లక్ష్యంగా, అధికారమే ఆశయంగా ఆమె రాజకీయాలలోకి వచ్చి ఉంటే మంచిదే. నిజంగా ఆలా వచ్చి ఉంటే ఆమె తెలంగాణాకు మాత్రమే పరిమితం కావాలి. అలా కాకుండా అన్నను నియంత్రించడమే షర్మిల ధ్యేయం అయితే మాత్రం అది ఆ ఇద్దరికే కాకుండా వైఎస్ కుటుంబం మొత్తానికి తీరని నష్టాన్ని కలిగిస్తుందన్నది రాజకీయ మేధావుల అభిప్రాయం. ఆంధ్రలో కూడా పార్టీ పెట్టి అన్నకు వ్యతిరేకంగా తిరిగినందువల్ల ఆమె పెద్దగా లాభపడేదేమీ లేదు. గత ఎన్నికలలో 'బై బై బాబు... బై బై పప్పు' అంటూ అందరినీ ఆకట్టుకున్న షర్మిల ఇప్పుడు 'జై జై బాబు' అనో లేక 'జై జై పప్పు' అనో అనలేరు. అలాకాకుండా ఆమె సొంతంగా ఎన్నికల బరిలో దిగితే ఆమెకు మేలు జరగకపోగా పక్క పార్టీవారు తనను, తన అన్నను వేలెత్తి చూపించడానికి అవకాశం కల్పించినట్లే. ఆలా జరిగినప్పుడు షర్మిలతో పాటు జగన్‌మోహన్‌రెడ్డికి కూడా స్వల్పంగా నష్టం జరిగే అవకాశాలు ఉన్నా, షర్మిల మాత్రం ఆంధ్రలో అధికారంలోకి రావడం కల్ల అన్నది విశ్లేషకుల అభిప్రాయం. మొత్తం మీద వైఎస్ కుటుంబకథా చిత్రంగా రాబోయే తెలంగాణ, ఆంధ్ర సారస్వతిక ఎన్నికలు ఉండబోతాయన్నది మాత్రం స్పష్టమైపోతుందంటున్నారు విశ్లేషకులు. బలమైన అధికారపక్షాన్ని కలిసి ఎదుర్కొని ప్రతిపక్షంలో కూర్చోబెట్టిన అన్నా చెల్లెళ్ళే... ఇప్పుడు పూర్తిగా బలహీనపడిపోయిన ప్రతిపక్షానికి మళ్ళీ జవసత్వాలు అందిస్తారేమోనని పార్టీ శ్రేణులు, వైఎస్ కుటుంబ అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అక్కడా... ఇక్కడా...? ఎక్కడ?.. అని సందిగ్ధంలో ఉండకుండా షర్మిల అక్కడికే పరిమితమై తాను అనుకున్నది సాధిస్తే బాగుంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

నిజానికి, తెలంగాణ ఎన్నికలు ఆంధ్రాలో ఎన్నికల కంటే దాదాపు ఆరునెలలు ముందుగా జరుగుతాయి. అందువల్ల, తన దృష్టిని పూర్తిగా తెలంగాణపై కేంద్రీకరించకుండా, అక్కడో కాలు.. ఇక్కడో కాలు పెడితే... తెలంగాణలో కూడా ఓటర్లు, రాజకీయ నాయకుల దృష్టిలో షర్మిల పలుచన అయ్యే ప్రమాదం లేకపోలేదని కూడా అంటున్నారు.

# కలసివుంటే కలదుసుఖం

(మొదటి పేజీ తరువాయి)





ఉంటుంది. ఇలాంటి తరుణంలో పార్టీని, పార్టీ అభిమానులని దూరం కాకుండా చేసుకోవాల్సిన బాధ్యత పార్టీ అదిష్టానందే. జిల్లాలో ఎవరికి వారే నాయకులుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా పార్టీకి ఒక పెద్ద అంటూ లేరు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి లాంటి వాళ్ళు ఉన్నా ఆయనకు వీళ్ళు అలవికారు. ఆయనముందు అతి వినయం నటించి బయటకు వచ్చి ఆయనపైన సైతం బురద జల్లగల సమర్ధత వీరిది. సజ్జల, బాలినేని లాంటివాళ్ళు జిల్లాకి విజిటింగ్ లీడర్లే తప్ప ట్రబుల్‌షూటర్లనిపించుకోలేకపోతున్నారు. జాతీయపార్టీ అధికారంలో ఉన్నా, ప్రాంతీయ పార్టీ అధికారంలో ఉన్నా ఇలాంటి ఆధిపత్యపు పోకడలు జిల్లాలో ఎప్పుడూ లేవు. అప్పట్లో జిల్లాకి ఒకరో ఇద్దరో పెద్ద నాయకులు, వారికి ఒక వర్గం, మంచి మర్యాదా ఉండేవి. ఇప్పుడవేమీ లేవు. ఎవరికివారే నాయకులు. ఎవరి నియోజకవర్గం వారి సామ్రాజ్యం. ఎవరి మధ్యా సయోధ్య లేదు. ఎదురుపడితే చేతులు కలుపుకుంటారు, అవసరమైతే ఒకే వేదిక పంచుకుంటారు. ఆ తరువాత ఒకరికొకరు గోతులు తవ్వుకుంటారు. తాను గెలవడమే ప్రధానం అనుకుంటారు, పార్టీ ఏమైపోయినా ఫరవాలేదన్నట్లుగా ప్రవర్తిస్తారు. ఇదీ ప్రస్తుతం జిల్లాలో పరిస్థితి. మార్చి తరువాత మంత్రివర్గంలో కూడా మార్పులు ఉంటాయన్న వార్తలు బలంగా వినపడుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఆనం-మేకపాటి భేటీ ప్రత్యేకతను సంతరించుకుంది. ఏం జరగబోతుందో వేచిచూడాలి..!

# వైకుంఠనాథునిగా వేణుగోపాలుడు

నెల్లూరు మూలాపేటలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో జరుగుతున్న పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 5న స్వామివారికి కన్నులపండువగా వైకుంఠనాథుని అలంకారం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకకు పేడూరు వెంకటరత్నం దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడి, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.






# విఎస్‌యులో సావిత్రిబాయి పూలే జయంతి

నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని శ్రీ పొట్టి శ్రీరాములు భవనంలో ఈనెల 3న భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.యం సుందరవల్లి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, పీడిత ప్రజలు, ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణిగా సావిత్రిబాయి పూలే దేశప్రఖ్యాతి చెందారని కొనియాడారు. సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే పుట్టినరోజైన జనవరి 3ను జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. విఎస్‌యు రెక్టార్ ఆచార్య ఎం చంద్రయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య సుజా ఎస్ నాయర్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### విదేశీపక్షుల కిలకిలారావాలతో..

# నేలపట్టులో సందడి





విదేశీపక్షుల కిలకిలారావాలతో దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు ప్రాంతమంతా సందడిగా మారింది. సముద్రాలను కూడా దాటుకుని పలు దేశాల పక్షులు నేలపట్టు, పులికాట్ ప్రాంతాలకు ఆహారం కోసం ప్రతి ఏటా ఈ సీజన్‌లో వస్తుంటాయి. ఇక్కడే గూళ్ళు కట్టుకుని, గుడ్లు పెట్టి పిల్లలను పొదిగి, వాటికి రెక్కలొచ్చేదాకా ఇక్కడే ఉండి ఆ తర్వాత వాటితో కలిసి హాయిగా తిరిగి తమ స్వస్థలాలకు వెళ్ళిపోతుంటాయి. ఇప్పుడు కూడా అనేకదేశాల నుంచి ఎన్నో రకాల పక్షులు నేలపట్టు వద్దకు వచ్చేశాయి. అక్కడున్న చెట్లపై విహంగాల కోలాహలాన్ని చూసేందుకు పెద్దసంఖ్యలో నిత్యం పర్యాటకులు తరలివస్తున్నారు. వేలాదిగా ఉన్న రంగరంగుల పక్షులు గుంపులు గుంపులుగా ఎగురుతూ ఉంటే వాటి సోయగాలు చూసి పెద్దలు, పిల్లలు ఎంతో ఆనందిస్తున్నారు. ఇప్పటికే సుమారు 12వేలకు పైగానే పక్షులు నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం ప్రాంతానికి వచ్చినట్లు అధికారులు చెప్తున్నారు. పక్షులను చూసేందుకు వచ్చేవారు కోవిడ్ నిబంధనలు పాటించాలని వారు కోరుతున్నారు.

# సచివాలయ ఉద్యోగుల సేవలు అభినందనీయం

### - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఛైర్మెన్ చేజర్ల సుధాకర్‌రావు



సచివాలయు సెక్రటరీల అడ్‌హాక్ కమిటీకి ఎన్నికైన సభ్యులు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలోనూ, కరోనా వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు సహకరించడంలోనూ సచివాలయ ఉద్యోగుల సేవలు ఎంతో అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఛైర్మెన్ చేజర్ల సుధాకర్‌రావు కొనియాడారు. ఈనెల 2న నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అవినీతి ఆరోపణలు లేని విద్యావంతులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థలోకి తీసుకువచ్చారని, దీంతో ప్రజల సంక్షేమ పథకాల అమలుకు ఎంతో వీలు కలుగుతోందని అన్నారు. అనంతరం నెల్లూరు సిటీ, రూరల్ పరిధిలోని సచివాలయాల సెక్రటరీలతో అడ్‌హాక్ కమిటీలను నియమించారు. సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరీష్, ప్రధాన కార్యదర్శి చప్పరం వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేంద్ర ఆధ్వర్యంలో నెల్లూరు నగర కార్పొరేషన్ సచివాలయ ఉద్యోగుల సంఘం అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎం.బాలరాజన్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల సుమన్, కోశాధికారిగా వినీల, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కె.మల్లికార్జున, టి.వెంకటకీర్తిప్రియ, ఉపాధ్యక్షులుగా చరణ్‌జ్యోతి, భానుప్రకాష్, కోటేశ్వర రావు, స్విగ్ధ, శరణ్, సంయుక్త కార్యదర్శులుగా రాపూరు రమణయ్య, వినాయక్ యాదవ్, సుధీర్, ద్వారక, రహీన, శోభలతో పాటు పలువురు సభ్యులు ఎన్నికయ్యారు.

# దేశానికే ఆదర్శం.. సిఎం జగన్

### - ప్రశంసించిన మంత్రి గౌతంరెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శమని, రాష్ట్రంలో ప్రజల అభ్యున్నతి కోసం అటు అభివృద్ధి కార్యక్రమాలు, ఇటు ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి నిరంతర దీక్షతో వాటిని అమలుచేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి కొనియాడారు. జనవరి 1న నెల్లూరు కలెక్టరేట్‌లో అర్హులైన లబ్దిదారులకు 2500 రూపాయల వంతున పింఛను అందజేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రానున్న 30 ఏళ్ళ వరకు రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికలను రూపొందించి సిద్ధం చేసి ఉంచారని, నవరత్నాల పథకాలను అమలుచేస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటునందిస్తున్నారని అన్నారు. అవ్వాతాతలకు పెంచిన పింఛను పథకం ద్వారా వారి జీవితాలకు భరోసా కల్పిస్తున్నారని, పింఛను పెరగడంతో వృద్ధుల కుటుంబాల్లో ఎంతో సంతోషం కలుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి డా.అనిల్‌కుమార్‌యాదవ్, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీలు హరేందిరప్రసాద్, గణేష్ కుమార్, విదేహ్‌ఖరే, రోజ్‌మాండ్, డిఆర్‌ఓ చిన్నఓబులేసు, కమిషనర్ దినేష్‌కుమార్, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి, జడ్పీ సిఇఓ శ్రీనివాసరావు, డిపిఓ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారునికి పెంచిన పింఛను అందజేస్తున్న మంత్రి మేకపాటి తదితరులు

# కరోనా థర్డ్‌వేవ్‌తో జాగ్రత్త

### అందరూ అప్రమత్తంగా ఉండాలి - హెచ్చరించిన కలెక్టర్ చక్రధర్‌బాబు



కరోనా థర్డ్‌వేవ్, ఒమిక్రాన్ వేరియంట్ విస్తరిస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ అవసరమైనా ముందస్తు ఏర్పాట్లు, మౌలిక వసతులతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. ఈనెల 4న కలెక్టరేట్‌లో ఆయన వైద్యాధికారులు, నోడల్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులతో సమావేశమై కోవిడ్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో ఆక్సిజన్ పరికరాలు, సిలిండర్లు, వెంటిలేటర్లు తదితర వైద్య సామగ్రి అంతా తప్పనిసరిగా ఉండాలని, ముందస్తుగా వాటిని పరిశీలించి సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. కోవిడ్ రెండు దశల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మూడో ముప్పు రాకుండా, వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనేవిధంగా ప్రభుత్వం సూచించే నియమనిబంధనలను పటిష్టంగా అమలుచేయాలని చెప్పారు. కోవిడ్ నోడల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో కరోనా కట్టడికి చర్యలు తీసుకోవాలని, కరోనా లక్షణాలున్నవారిని గుర్తించి వారికి ఆరోగ్యపరీక్షలు చేయించాలని, కరోనా పాజిటివ్ వచ్చినవారు హోం ఐసోలేషన్‌లో ఉండడానికి అవసరమైన మందుల కిట్‌లను అందజేయాలని సూచించారు. కరోనా వైరస్‌ను కట్టడిచేసి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన ఆక్సిజన్ ఉత్పత్తి ప్లాంట్‌లను, ఆక్సిజన్ నిల్వలను, ఇతరత్రా వైద్యపరికరాలన్నిటినీ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో కోవిడ్‌కేర్ సెంటర్లను సిద్ధం చేయాలన్నారు. కోవిడ్ నియమ నిబంధనల పట్ల ప్రతిఒక్కరికీ అవగాహన కలిగించాలని, ప్రజలు మాస్కులు ధరించేలా, శానిటైజర్లు వినియోగించేలా, సామాజిక దూరం పాటించేలా అన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇప్పటికే కరోనాతో మృతిచెందిన వారి కుటుంబాలకు, తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ప్రభుత్వం ప్రకటించిన సాయాన్ని త్వరితగతిన అందజేయాలని ఆదేశించారు. 15 నుంచి 18 ఏళ్ళలోపు పిల్లలకు వేస్తున్న టీకా కార్యక్రమాన్ని నూటికి నూరుశాతం పూర్తిచేయాలని, జిల్లాలో ప్రివెంటివ్ డోసు టీకాను ఈనెల 10 నుంచి 13వ తేదీలోపు వేసి అనుకున్న లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జేసీ రోజ్‌మాండ్, అడిషనల్ ఎస్పీ వెంకటరత్నం, డిఆర్‌ఓ చిన్నఓబులేసు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ దాస్, డిఎం అండ్ హెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డిపిఓ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పొదలకూరులో 7 నుంచి

# షటిల్ పోటీలు

ఈనెల 7,8,9 తేదీల్లో దివంగత నేత కాకాణి రమణారెడ్డి మెమోరియల్ షటిల్ టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు పొదలకూరులోని వినాయక షటిల్ క్లబ్ వారు సమాయత్తమయ్యారు. పురుషుల డబుల్స్‌లో విజేతలకు వరుసగా 6వేలు, 5వేలు, 4వేలు, 3వేలు, 2వేల రూపాయల వంతున బహుమతులందజేస్తామని షటిల్‌క్లబ్ నిర్వాహకులు ఊకోటి లక్ష్మీనారాయణ తెలిపారు. వివరాలకు 83746 49472, లేదా 89191 25249 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# అన్నారెడ్డిపాళెంలో.. బాపూజీ గ్రంథాలయం



విడవలూరు మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో పలువురు దాతల సహకారంతో ఇటీవల గ్రంథాలయాన్ని నిర్మించి దానికి 'బాపూజీ గ్రంథాలయం'గా నామకరణం చేశారు. ఈనెల 2న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవి రమణయ్య చేతుల మీదుగా ఈ గ్రంథాలయానికి ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు ఎంతగానో దోహదం చేస్తాయని, విద్యార్థులంతా ఇక్కడున్న పుస్తకాలను అధ్యయనం చేసి పోటీ పరీక్షలకు తయారై మంచి ఉద్యోగాలను పొందాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ స్థల దాతలు సుకుమార్, ఏసిబి మాజీ డిఎస్పీ తోట ప్రభాకర్, అమర్‌రాజా బ్యాటరీస్ ఎం.డి రావుల బాలాజీ, అటవీ అధికారి రామచంద్రయ్య పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

### - ఏఐటియుసి నేత వెంకటసుబ్బయ్య విజ్ఞప్తి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం వెంటనే నిధులను కేటాయించి కార్మికులను ఆదుకోవాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 2వతేదీ ఆయన నెల్లూరులోని రామకోటయ్య భవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ నిధులను సంక్షేమ బోర్డుకు అందించాలని కోరారు. ఏఐటియుసి జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, నాయకులు బోసు, వెంగయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సాగర తీరాల్లో...

# పర్యావరణానికి నష్టం కలిగించకండి!

## ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు హితవు



లక్షద్వీప్‌లో ఉదయం నడకలో సతీమణి ఉషమ్మతో ఉషాపతి

ప్రకృతికి, పర్యావరణానికి ఎవరూ నష్టం కలిగించకూడదని, మానవ మనుగడకు ప్రాణప్రదమైన పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఇటీవల ఆయన తన సతీమణి ఉషమ్మతో కలసి లక్షద్వీప్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా భూతాపం పెరుగుతున్నందువల్ల ఏర్పడుతున్న ముప్పు గురించి, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తన అభిప్రాయాలను ఫేస్‌బుక్‌లో పంచుకున్నారు. ముఖ్యంగా పర్యాటకులు ఆయా ప్రాంతాల్లోని స్థానిక ప్రజల బాగోగులను దృష్టిలో పెట్టుకుని, పర్యావరణానికి నష్టం కలగకుండా వ్యవహరించాలని సూచించారు. పర్యాటకపరంగా భారత్ అత్యున్నత గమ్యస్థానంగా ఉందని ఆయన అంటూ, హిమాలయాలు, రాజస్థాన్‌లోని అద్భుతమైన కట్టడాలు, ఉత్తరాఖండ్‌లోని ఆధ్యాత్మిక స్థలాలు, గోవాలోని బీచ్‌లు ఇలా అన్నీ వేటికవే అత్యున్నతమైన పర్యాటక ప్రాంతాలుగా ఉన్నాయని, దేశంలోని ప్రతి ఒక్కరూ మన భారతీయ పర్యాటక స్థలాలు, ప్రాంతాల సోయగాలను తిలకించాలని సూచించారు. అయితే, పర్యాటకులు తమ పర్యటన సందర్భాల్లో పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మెలగాలన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. భూతాపంతో ద్వీపాలకు ముప్పు పొంచి ఉందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచినప్పుడే ద్వీపాలను రక్షించుకోగలమన్నారు. తుఫాన్‌లు, వరదలు, తీరప్రాంత కోతలు వగైరాలు ద్వీపాల్లో నివసించేవారికి పెనుముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. ఇలాంటి చోట్ల పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూనే, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

## 13న ముక్కోటి ఏకాదశి..

# 'వైకుంఠ ద్వారదర్శనం'

## శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో పటిష్టంగా ఏర్పాట్లు



జనవరి 13వ తేది గురువారం నాడు ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వారదర్శనం ఉంటుంది. ఆ రోజున భక్తులు వేలాదిగా తరలివచ్చి వైకుంఠ ద్వారం ద్వారా ఆలయంలోకి వెళ్ళి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ కనుక ఆలయ నిర్వాహకులు అందుకోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజున వేకువన 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వైకుంఠ ద్వారదర్శనం ఉంటుందని ఆలయవర్గాలు పేర్కొన్నాయి.

### వేడుకగా అధ్యయనోత్సవాలు :

జనవరి 3 నుంచి రంగనాథస్వామి దేవాలయంలో వేడుకగా అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. జనవరి 23వ తేదీ దాకా జరిగే ఈ వేడుకల్లో పగల్‌పత్తు–రాపత్తు ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి విశేషపూజలు చేస్తున్నారు. అదేవిధంగా సంక్రాంతి పండుగలను సందర్భంగా స్వామివారికి ఈనెల 14న భోగి కల్యాణం జరుగుతుంది. శ్రీకృష్ణచరిత మానసమండలి ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి ఈ వేడుక నిర్వహిస్తారు. 16వ తేది ఆదివారం ఉదయం 11 గంటల నుంచి కనుమ పండుగ సందర్భంగా కనుమ పార్వేట ఉత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# పారిశుద్ధ్య పరిరక్షణే ప్రధానం

## - కొత్త కార్పొరేటర్లతో కమిషనర్ పలు ప్రాంతాల సందర్శన



కార్పొరేటర్లకు పారిశుద్ధ్య ప్రణాళికను వివరిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్

పారిశుద్ధ్య పరిరక్షణే కార్పొరేషన్ విధుల్లో ప్రధానమైనదని, అందుకోసం పటిష్టమైన ప్రణాళికలను అమలు చేస్తు న్నామని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ చెప్పారు.

నెల్లూరు నగరపాలక సంస్థకు కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లతో కలసి ఆయన ఈ నెల 5న నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. కార్పొరేటర్ల శిక్షణా తరగతుల్లో భాగంగా నగర మేయర్ స్రవంతి, కార్పొరేషన్ అధికారులతో కలసి ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. నగరంలోని బోడిగాడితోట, దొంతాలి, ఆమంచర్ల ప్రాంతాల్లో ఉన్న డంపింగ్ యార్డ్‌లను, అల్లీపురం, వెంకటేశ్వరపురంలలో ఉన్న మురుగు నీటి శుద్ధి కేంద్రాలను వారు సందర్శించారు. ఇంటింటి చెత్త సేకరణ, చెత్త తరలింపు, రీసైక్లింగ్, చెత్త నుంచి ఎరువుల తయారీ తదితర ప్రక్రియలను కమిషనర్ ఈ సందర్భంగా కార్పొరేటర్లకు వివరించారు. మాగుంట లేఅవుట్‌లో కొత్తగా నిర్మిస్తున్న సైన్స్‌పార్కుకు కూడా అందరితో కలసి వెళ్లి ఆ పార్కు ప్రాధాన్యతను వారికి చెప్పారు. ఆ తర్వాత సంగం మండలంలోని మహమ్మదాపురం గ్రామంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మెగా వాటర్‌ప్లాంట్ ప్రాధాన్యతను కార్పొరేటర్లకు వివరించారు. కార్పొరేషన్ డెప్యూటి మేయర్లు, అన్ని డివిజన్‌ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.




# షార్, 'నేలపట్టు'లను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 19 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఈనెల 5న శ్రీహరికోటలోని భారత అంతరిక్ష ప్రయోగం (షార్) కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి షార్ డైరెక్టర్ రాజరాజన్ శ్రీహరికోట విశిష్టతను, రాకెట్ ప్రయోగాల వివరాలను వారికి తెలియజేశారు. షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, ఏఎస్ఏ డెప్యూటి డైరెక్టర్ సెంథిల్‌కుమార్, ఎంఎస్‌జి గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొని జ్ఞాపికలందజేశారు. అనంతరం వారు నేలపట్టుకు వెళ్ళి పక్షుల రక్షిత కేంద్రాన్ని సందర్శించారు. విదేశీ విహంగాల సోయగాలను తిలకించారు. నేలపట్టు వద్ద వారిని తహశీల్దార్ రాఘవేంద్రరావు, డెప్యూటి తహశీల్దారు సందీప్ కుమార్, ఎస్ఐ తిరుమలరావులు కలసి పక్షుల రక్షిత కేంద్రం ప్రత్యేకతలను వివరించారు.






## 'మురళీకృష్ణ' గోపాలయ్య ప్రథమ వర్ధంతి



గత ఏడాది జనవరి 14న దివంగతులైన మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకులు గ్రోసు గోపాలయ్య ప్రథమ వర్ధంతి తిథుల ప్రకారం జనవరి 3వ తేదీ జరిగింది. నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వారి పెద్దకుమారుడు గ్రోసు సుబ్బారావు ఇంటి వద్ద కోవిడ్ నిబంధనలను పాటిస్తూ కేవలం కుటుంబసభ్యులకే పరిమితం చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమీప బంధువులు, కుటుంబసభ్యులు పాల్గొని గోపాలయ్యకి నివాళులర్పించారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com